
కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోంది.2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేయడం, వివిధ సొసైటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం చారిత్రాత్మక నిర్ణయాలు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 27.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 66 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


# ఆధార్‌తోనే సర్టిఫికెట్ల డీజీ వెరిఫై

DG VERIFY



- విద్యా, క్రీడా సర్టిఫికెట్లకు రియల్‌టైమ్ ధ్రువీకరణ వ్యవస్థ
- ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు చర్యలు
- ఆర్టీజీఎస్ అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఆర్టీజీఎస్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల ప్రగతిపై ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీకరించేందుకు చేపట్టిన డేటాలేక్ పనులన్నీ జులై నాటికి పూర్తికావాలని మంత్రి ఆదేశించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలి. రేషన్ కార్డుల విభజన, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం, తొలగించే ప్రక్రియను మరింత సులభతరం చేయాలి. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్ తో అనుసంధానించాలి. పాఠశాలల్లో డ్రాప్ అవుట్లను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, తగ్గించడానికి గల మార్గాలను అన్వేషించాలి. విద్యారంగంలో సమగ్ర సమాచారాన్ని ట్రాక్ చేస్తున్నాం. అన్ని శాఖల సమాచారం డేటా లేక్ ద్వారా అనుసంధానం కావాలని మంత్రి సూచించారు.

**మనమిత్ర ప్రజలకు మరింత చేరువ కావాలి :** ప్రజల్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై మరింతగా అవగాహన కలిగేలా నెలరోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలకు కలిగే ఉపయోగం, వినియోగం, సులభంగా ప్రభుత్వ సేవలు ఎలా పొందవచ్చో ప్రజలకు వివరించాలన్నారు.

**సర్టిఫికెట్ల వెర్ఫికేషన్‌కు ఆధార్ :** విద్యార్థులు, అభ్యర్థులకు విద్యా-క్రీడా సంస్థలు ఇచ్చే సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లన్నీ అభ్యర్థి ఆధార్ నెంబర్ ఆధారంగా పారదర్శకంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థి ఆధార్ నంబర్ కొడితే ఆ విద్యార్థి లేదా అభ్యర్థికి ఆ సర్టిఫికెట్లు ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు కూడా రియల్ టైమ్‌లో తెలిసేలా డీజీ వెరిఫైని పకడ్బందీగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. దీనివల్ల 99 శాతం అధికారుల పని కూడా సులభతరం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఇచ్చే వేలాది పోస్టుల నోటిఫికేషన్లకు, లక్షల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటారని, వీరందరి సర్టిఫికెట్లు పొందుపరచడంలో ఇబ్బందులు లేకుండా డీజీ వెరిఫైని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొందాం :** రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావంపైనా మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను జలవనరుల శాఖ, వ్యవసాయ శాఖ, ఇతర శాఖలన్నీ కూడా సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా పనిచేసి సమర్థవంతంగా ఎదుర్కొందామన్నారు. నీరు వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జలాశయాల్లో నీటి లభ్యత ఎంత ఉంది, భూగర్భజల మట్టాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం ద్వారా రియల్ టైమ్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆ దిశగా అధికారులు కార్యాచరణ చేపట్టాలి.



● వివరాలు 2 లో

## టీచర్లే 'ఛేంజ్ మేకర్స్'!



విద్యావ్యవస్థలో మార్పునకు నాయకత్వం వహించాలన్న లోకేష్


- మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు
- విద్యారంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు పిలుపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రజా ప్రభుత్వం టీచర్లను లీడర్లు భావిస్తోంది, కష్టపడి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపునిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన 37మంది ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సమావేశమయ్యారు. సింగపూర్ అధ్యయన యాత్రలో తాము తెలుసుకున్న అంశాలు, రాష్ట్రంలో వాటిని అమలు చేయడానికి గల అవకాశాలను వారు మంత్రికి వివరించారు. మిగతా 2లో...



## ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. తెనాలి పట్టణంలోని మూడో, నాలుగో వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులతో మాట్లాడారు.

అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మిగతా 2లో...





## ఎరువుల పంపిణీలో పారదర్శకత

- దుష్ప్రచారాలను నమ్మొద్దు
- మంత్రి అచ్చెన్నాయుడు

2 లో

## రాష్ట్రమంతా ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం

- పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంగా రాష్ట్రమంతా నిర్వహించాలని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మురుగు కాలువల శుద్ధి, సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్త వంటి కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ మిగతా 2లో...

## ఏపీలో భారీ వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- వాతావరణ మార్పుల ప్రభావంతో ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు
- ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు
- పలు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న రెండు రోజులు వర్ష ప్రభావం
- ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

2 లో



## ఎస్ఐఆర్‌కు ఏడాది పూర్తి




- 6 కోట్ల ఓట్లు తొలగింపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు ఏడాది పూర్తయింది. ఈ ప్రక్షాళనలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 6 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఎన్నికల సంఘం తొలగించింది. ఈ భారీ తొలగింపులపై ప్రతిపక్షాలు, ఎన్నికల సంఘం మధ్య తీవ్ర మాటల యుద్ధం నడుస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశ ప్రక్షాళన కొనసాగుతోంది.

**బిహార్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం :** గత ఏడాది జూన్ 24న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది. బిహార్‌లో ఈ ప్రక్రియ ద్వారా ఏకంగా 65 లక్షల ఓట్లను తొలగించారు. అయితే, పత్రాలు లేవన్న నెపంతో, మిగతా 2లో...

## వెనెజువెలాకు భారత్ ఆపన్నహస్తం



- 'అపరేషన్ అమిస్టాడ్' పేరుతో సాయం

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** వరుస భూకంపాలతో అతలాకుతలమైన వెనుజువెలాకు భారత్ ఆపన్నహస్తం అందించింది. ఆపరేషన్ అమిస్టాడ్ పేరుతో ఆ దేశానికి భారీ సహాయక కార్యక్రమాన్ని చేపట్టింది. రెండు వాయుసేన విమానాల్లో సహాయక సామాగ్రి, వైద్యబృందాన్ని పంపింది. వెనుజువెలాకు సహాయం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ మిషన్‌కు 'ఆపరేషన్ అమిస్టాడ్' అని నామకరణం చేసినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యలకు భారత్ కట్టుబడి ఉంటుందని జైశంకర్ పునరుద్ఘాటించారు.

"వెనుజువెలాకు అత్యవసర సాయాన్ని అందించేందుకు, భారత వైమానిక దళానికి చెందిన రెండు జ-17 విమానాలు శుక్రవారం ఆ దేశానికి బయలుదేరాయి. ఈ సహాయక సామగ్రిలో భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, 35 టన్నులకు పైగా సహాయక సామాగ్రి, మందులు, వైద్య పరికరాలు ఉన్నాయి. ఈ క్లిష్ట సమయంలో వెనిజులా ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని జైశంకర్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ఇక, 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన ఒక వైద్య బృందం వెనిజులాకు బయలుదేరిందని భారత సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మిగతా 2లో...

## పోలియోకు నో ఛాన్స్!



- పోలియో రహిత రాష్ట్రం కోసం సమష్టి కృషి అవసరం
- ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలి
- పోలియో నిర్మూలనలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు
- జూన్ 28 పల్స్ పోలియోకు విస్తృత ఏర్పాట్లు
- వైద్య , ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్

2 లో

## పెనుకొండ నా జాగీరే



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టీకరణ
- గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి పెనుకొండలో చేస్తున్నాం
- రోడ్లు, కాలువలు, వంతెనలు నిర్మిస్తున్నాం
- 24 నెలల్లో రూ.13.40 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు ఇచ్చాం
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో అభివృద్ధి పరుగులు : మంత్రి సవిత

**పెనుకొండ (జర్నలిస్ట్ ఫైల్)** ఎస్... పెనుకొండ నా జాగీరే... గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని కూటమి ప్రభుత్వ హయాంలో నియోజక వర్గంలో చేస్తున్నాను... పేదల వైద్య ఖర్చుల కోసం రూ. 13.40 కోట్లకు పైగా అందజేశాను... ఈరోజు రూ.కోటీ 15 లక్షల వరకూ అందజేస్తున్నాను... పేదల ఆరోగ్య రక్షణే నా ప్రథమ కర్తవ్యం అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పెనుకొండ నియోజక వర్గానికి చెందిన 121 మంది లబ్దిదారులకు రూ. 1.15 కోట్ల విలువైన మిగతా 2లో...

# ఏపీలో భారీ వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వాతావరణ మార్పుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో శనివారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ... రేపు ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా రానున్న కొద్దిరోజుల పాటు ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తన నివేదికలో పేర్కొంది.

ఆదివారం (జూన్ 28) కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రమంతా ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి శుక్రవారం క్షేత్ర స్థాయిలో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. మురుగు నీటి నిల్వలను తొలగించాలని చెప్పారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తాగు నీరు, పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణే కూటమి లక్ష్యమని, అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోదుతులో అందుబాటులో ఉంచాలని అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు.

## పోలియోకు నో ఛాన్స్!




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్రంలో పోలియో రహిత హోదాను కొనసాగించేందుకు జూన్ 28న నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్య అధికారులు, ఇమ్యునైజేషన్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం దాదాపు 30 వేల పోలియో బూత్‌లు, ఇంటింటికీ వెళ్లే ప్రత్యేక బృందాలు, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వ్యాక్సిన్ నిల్వలు, కోల్డ్‌చైన్ నిర్వహణ, మానవ వనరుల వినియోగం, పర్యవేక్షణ వ్యవస్థలను ముందుగానే సిద్ధం చేసినట్లు చెప్పారు.

పోలియో బూత్‌లలో చుక్కలు వేయించని చిన్నారులను గుర్తించేందుకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, నిర్మాణ పనుల ప్రాంతాలు, ఇటుక బట్టీలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు వంటి అధిక ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాల వారీగా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని సురేష్ కుమార్ అన్నారు. ప్రతి తల్లిదండ్రులు ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో కేంద్రానికి తీసుకువచ్చి రెండు చుక్కల వ్యాక్సిన్ వేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే రాష్ట్రంలో పోలియో రహిత హోదాను శాశ్వతంగా కొనసాగించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆదాయానికి మించిన ఆస్తులు... పీసీబీ జోనల్ అధికారి ఇంట్లో ఏసీబీ సోదాలు




**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి పీసీబీ కార్యాలయం జోనల్ అధికారి యుగంధర్ మునిప్రసాద్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కర్నూలు చాణక్యపురి కాలనీలోని మునిప్రసాద్ నివాసంలో తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే పలు రకాల రికార్డులను అధికారులు పరిశీలించారు. స్థానిక నివాసంతో పాటు ఆయనకు సంబంధించి మరికొన్ని ప్రాంతాల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చేసిన సోదాల్లో పలు రికార్డులు, డైరీలు, ఇతర కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన సర్వీసు కాలంలో సంపాదించిన స్థిర, చరాస్తుల విలువ, ప్రభుత్వ లెక్కల్లో ఉన్న ఆదాయానికి మధ్య భారీగా తేడాలున్నట్లు గుర్తించినట్లు సమాచారం. బినామీ ఆస్తులు, బంగారంలాంటి పూర్తి వివరాలు ప్రకటించాల్సి ఉంది. ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తుండటంతో పీసీబీ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

# ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)



ఓటరు జాబితాలను ఖచ్చితంగా, తాజాగా ఉంచేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారి పేర్ల నమోదు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాల సవరణ, ఓటరు జాబితాలోని తప్పుల సరిదిద్దడం, నకిలీ నమోదుల తొలగింపు వంటి చర్యలు చేపడతారని వివరించారు.

ఎస్ఐఆర్ సమయంలో కొత్త ఓటరుగా నమోదు కావడంతో పాటు పేరు, చిరునామా, వయస్సు వంటి వివరాలను సవరించుకోవచ్చని, మరో నియోజకవర్గానికి మారిన వారు ఓటరు నమోదును బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. అవసరమైతే ఓటరు పేరును తొలగించే అవకాశమూ ఉందన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం లేదా వయస్సు రుజువు, నివాస ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు వంటి పత్రాలు అవసరమవుతాయని చెప్పారు.

డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత ప్రజలు అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, అన్ని అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది ఓటరు జాబితా విడుదల చేస్తారని తెలిపారు. ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో పారదర్శకత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్రంలో రైతులకు సబ్సిడీ ఎరువులను పారదర్శకంగా, సకాలంలో అందించేందుకు ప్రవేశపెట్టిన ఏ.పి.ఏ.ఐ.ఎం.ఎస్ 2.0 వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జూన్ 8 నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి మిగిలిన అన్ని జిల్లాల్లో ఈ వ్యవస్థ ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ జరుగుతోందని వెల్లడించారు. ఇప్పటివరకు 2.97 లక్షల మంది రైతులకు 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ విధానం ద్వారా అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందుతున్నాయని, రైతుల సాగు విస్తీర్ణం, పంట అవసరాలు, శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు.

ఏ.పి.ఏ.ఐ.ఎం.ఎస్ 2.0 అమలుతో ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై రియల్‌టైమ్ పర్యవేక్షణ జరుగుతోందని, కౌలు రైతులతో పాటు అర్హులైన ప్రతి రైతుకూ సమాన అవకాశాలు కల్పించేలా వ్యవస్థను రూపొందించామని చెప్పారు. ప్రారంభ దశలో ఎదురైన స్వల్ప సాంకేతిక సమస్యల్లో అధిక భాగం ఇప్పటికే పరిష్కరించామని, ప్రస్తుతం వ్యవస్థ సజావుగా పనిచేస్తోందని తెలిపారు. ఎరువుల కొరత, నాణ్యత లేదా పంపిణీకి సంబంధించిన సమస్యలు ఉంటే రైతులు టోల్‌ఫ్రీ నంబర్ 155251కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ ఎరువుల పంపిణీలో జరిగిన అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికే ఏ.పి.ఏ.ఐ.ఎం.ఎస్ 2.0ను తీసుకొచ్చామని అచ్చెన్నాయుడు తెలిపారు. అక్రమ మళ్లింపుల మార్గాలు మూసుకుపోవడంతో కొందరు అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అనుకూలంగా ఉన్న పత్రికల ద్వారా ప్రభుత్వంపై నిరాధార కథనాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అధికారిక గణాంకాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను ధృవీకరించిన తర్వాతే వార్తలు ప్రచురించాలని సూచిస్తూ, వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను రైతులు విశ్వసించరని అన్నారు. పారదర్శక పాలనతో నిజమైన రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

టమాటా ధరలు పూర్తిగా పతనమయ్యాయంటూ జరుగుతున్న ప్రచారం కూడా వాస్తవాలకు విరుద్ధమని మంత్రి పేర్కొన్నారు. అధికారిక మార్కెట్ గణాంకాల ప్రకారం ధరలు స్థిరంగానే ఉన్నాయని తెలిపారు. అలాగే చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులోని జైన్ మ్యాంగో పల్ప్ యూనిట్ నిలిచిపోయిందన్న ప్రచారం కూడా అవాస్తవమని చెప్పారు. ఒక యూనిట్ నిరంతరంగా పనిచేస్తుండగా, మరో యూనిట్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించి తిరిగి కార్యకలాపాలు ప్రారంభించినట్లు వివరించారు. రైతులు అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, నిరాధార ప్రచారాలను నమ్మవద్దని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్‌కు ఏడాది పూర్తి

(మొదటి పేజీ తరువాయి)



అధికార బీజేపీకి మేలు చేసేందుకే ఎన్నికల సంఘం ఈ చర్యలకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కానీ, ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు ఏకగ్రీవ తీర్పుతో ఎన్నికల సంఘం చేపట్టిన ఈ రివిజన్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. అయితే, ఈ ఓట్ల తొలగింపు ప్రభావం సంక్షేమ పథకాలపై కూడా పడుతోంది. బంగాల్, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ఓటర్ల డేటాను సామాజిక భద్రతతో అనుసంధానం చేయడంతో, ఓటు హక్కు కోల్పోయిన వారు ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా దూరమవుతున్నారు.

**ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాల్లో ఎస్ఐఆర్ :** ఈ భారీ ప్రక్షాళన కార్యక్రమం ప్రాముఖ్యతను గుర్తిస్తూ, దీనిని ఎన్సీఈఆర్టీ సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల్లో కూడా చేర్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులను తొలగించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అందులో వివరించారు. ఇక గత ఏడాది అక్టోబరు 27న ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండో దశ ప్రారంభమైంది. దీని ద్వారా ఈ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను ఏకంగా 10.2 శాతం మేర కుదించారు. ప్రక్షాళనకు ముందు 50.99 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు పడిపోయింది. అంటే 5.18 కోట్లకు పైగా పేర్లను తొలగించారు. ఇందులో మరణించిన 66,88,000 మంది పేర్లను జాబితా నుంచి తీసేశారు. అత్యధికంగా యూపీలో 25.47 లక్షలు, బంగాల్‌లో 24.16 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత మరో 63.16 లక్షల పేర్లను డిలీట్ చేశారు.

ప్రస్తుతం (ఎస్?ఐఆర్?) ప్రక్రియ మూడో దశకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 14న మూడో దశ సవరణ ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏకంగా 36.73 కోట్ల మంది ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ మూడో దశ సవరణ ప్రక్రియ పూర్తిగా ముగియనుంది.

**యావత్ దేశాన్ని కుదిపేసిన వివాదం :** బంగాల్‌లోని మాల్దాలో ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొన్న ఏడుగురు న్యాయాధికారులను నిర్బంధించిన ఘటన అప్పట్లో యావత్ దేశాన్ని కుదిపేసింది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ ఆందోళనకారులు ఈ చర్యకు దిగారు. మొదట న్యాయాధికారులతో సమావేశం కావాలని నిరసనకారులు కోరగా, అందుకు అనుమతి నిరాకరించడంతో అధికారులను నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని జ్యుడీషియల్ అధికారులను నిర్బంధం నుంచి విడిపించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ విషయంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం మండిపడింది. ఇది దురదృష్టకర పరిణామమని ఆవేదన వ్యక్తం చేసింది. దీన్ని ఉద్దేశపూర్వకంగా చేసిన దాడిగా పేర్కొంది. బంగాల్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని వ్యాఖ్యానించింది. ముగ్గురు మహిళలు సహా ఏడుగురు న్యాయాధికారులను కొన్ని అసాంఘిక శక్తులు నిర్బంధించాయని, ఆ రోజు అర్ధరాత్రి వరకు తాను స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాల్సి వచ్చిందని స్వయంగా సీజేఐ వెల్లడించారు.

# పెనుకొండ నా జాగీరే


(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి సవిత శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తోందన్నారు. సర్జరీలు, అత్యవసర చికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసానిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత పెనుకొండ నియోజక వర్గానికి చెందిన నిరుపేదలకు రూ.13.40 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేశామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సకాలంలో సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీ అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున నిధులు తరలొస్తున్నాయని మంత్రి సవిత వెల్లడించారు.

**నా హయాంలోనే పెనుకొండ అభివృద్ధి :** గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత జరుగుతోందన్నారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రాస్ కూటమి ప్రభుత్వమన్నారు. అన్నదాత సుఖీభవ, దీపం 2 కింద మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం బస్సు ఛార్జీలు పెంచితే, మహిళా పక్షపాతి అయిన సీఎం చంద్రబాబు స్త్రీ శక్తి పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు, బీటీ రోడ్లు కూడా నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి, వైసీపీ నేతలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. తమ ప్రభుత్వంలో కూడా సీఎంఆర్ఎఫ్ నిధులు ఇంత పెద్ద స్థాయిలో మంజూరు కాలేదని వారు చెప్పుకుంటున్నారన్నారు. ముఖ్యంగా పెనుకొండ నియోజక వర్గ వ్యాప్తంగా రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. ముఖ్యంగా పెనుకొండ నియోజక వర్గంలో నేటి వరకూ రూ.13.40 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేశామన్నారు. నేడు 121 మంది లబ్ధిదారులకు రూ.కోటీ 15 లక్షలను అందజేశామన్నారు.ఎస్. పెనుకొండ తన జాగీరేనని, గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి తన హయాంలోనే జరుగుతోందని మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు తమకే ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్‌లను మంత్రి సవిత అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్‌తోనే సర్టిఫికెట్ల డీజీ వెరిఫై



(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. యూరియా సరఫరాపైనా మంత్రి ఆరా తీశారు.

**విద్యుత్ డిమాండ్ పైనా దృష్టి కేంద్రీకరించాలి :** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జల విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో ఎదురయ్యే సమస్యలు అధిగమించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మంత్రి సూచించారు. జలాశయాల్లో నీటి మట్టాలు, పెరుగుతున్న విద్యుత్తు వినియోగం, భూగర్భ జలాలు వీటన్నిటినీ క్రోడీకరించి ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం విశ్లేషించి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలి. విద్యుత్తు సరఫరాకు ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్, సంయుక్త కార్యదర్శి మాలిక గార్గ్, ఆర్టీఐహెచ్ సీఈవో ధాత్రి రెడ్డి, ఫైబర్‌నెట్ ఎండీ గీతాంజలి శర్మ, సివిల్ సప్లైస్ కమిషనర్ కన్నబాబు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్త, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మన్జీర్ జిలానీ పాల్గొన్నారు.

# వెనెజువెలాకు భారత్ ఆపన్నహస్తం



(మొదటి పేజీ తరువాయి)

"ఈ బృందంలో 9 మంది వైద్య అధికారులతో సహా 41 మంది సిబ్బంది ఉన్నారు. భూకంప బాధితులకు అత్యవసర వైద్య సంరక్షణ, గాయాల నిర్వహణ, శస్త్రచికిత్స, ఇతర అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించనున్నారు" అని పేర్కొంది.

**సైనిక బలగాలను కేటాయించిన అమెరికా :** మరోవైపు, వెనుజువెలాలో సహాయక చర్యలకు మద్దతుగా అమెరికా తన సైనిక బలగాలను కేటాయించింది. అమెరికా విదేశాంగ శాఖ ఆదేశాల మేరకు సదరన్ కమాండ్ ఒక భారీ మానవతా సహాయక చర్యను ప్రారంభించింది. ఇందుకోసం సి-17 గ్లోబ్‌మాస్టర్, సి-130 హెర్క్యూలస్ రవాణా విమానాలను మోహరించింది. ఇక, భారత్?, అమెరికాతో పాటు చిలీ, బొలీవియా, బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో సహా పలు దేశాలు కారకాస్‌కు సహాయాన్ని అందించాయి.

మరోవైపు, భూకంపం వల్ల జరిగిన విధ్వంసం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో వెనుజువెలాకు కావాల్సిన వైద్య సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ ఆపరేషన్ చేపట్టారు. ఇక, ప్రధాని పంపిన ఎక్స్ పోస్టుకు వెనుజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ కృతజ్ఞతలు తెలిపారు.

**ఆందోళనకర రీతిలో మృతుల సంఖ్య :** ఇదిలా ఉండగా, వెనిజులాలో బుధవారం వరుసగా 7.2, 7.5 తీవ్రతతో రెండు విధ్వంసకర భూకంపాలు సంభవించాయి. దీంతో చాలా ప్రాంతాల్లో భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ ఘటనలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే, మృతుల సంఖ్య ఆందోళనకర రీతిలో పెరుగుతోంది. గురువారం 164 ఉన్న మృతుల సంఖ్య, శుక్రవారం నాటికి 235కు చేరింది. అలాగే, 4300 మంది గాయపడ్డారని ఆరోగ్య శాఖ మంత్రి కార్లోస్ అల్వరాడో తెలిపారు. గాయపడిన చాలా మందికి శస్త్రచికిత్స అవసరమని ఆయన పేర్కొన్నారు. వేల మంది పైగా ఆచూకీ గల్లంతయ్యిందని చెప్పారు.

ఇక, భూకంప దాటికి రాజధాని కారకాస్, లా గువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఫలితంగా, దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు భారీ నష్టం వాటిల్లింది. ఆయా ప్రాంతాల నుంచి వెలువడిన లెక్కలేనన్ని దృశ్యాలు, అక్కడి నివాసితులు ఎదుర్కొన్న నష్ట తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. మరోవైపు, వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ఇదివరకే అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అలాగే, మౌలిక సదుపాయాలు, ఆసుపత్రులు, ఇళ్ల మరమ్మతులకు నిధులు సమకూర్చేందుకు 200 మిలియన్ డాలర్ల పునర్నిర్మాణ నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# ఘనంగా రొట్టెల పండుగ..



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రొట్టెల పండుగ ఏర్పాట్లను, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. స్వర్ణాల చెరువులో రొట్టెను వదిలి.. రొట్టెను పట్టుకున్నారు. ఆపై, దర్గాలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 412 సంవత్సరాల చరిత్ర ఉన్న బారాషహీద్ దర్గాలో ప్రతి ఏటా భక్తులు పెరుగుతున్నారని తెలిపారు. 2014కి ముందు 4 లక్షల మంది భక్తులు వచ్చేవారని.. సరైన వసతులు ఉండేవి కావన్నారు. ఇప్పుడు వసతులు పూర్తిగా పెంచి అభివృద్ధి చేశామని చెప్పారు.

గత ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పక్కన పెట్టిందని మంత్రి విమర్శించారు. టూరిజం హబ్‌గా నెల్లూరు బారాషహీద్ దర్గాని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎంతో నమ్మకంతో దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారన్నారు. స్వర్ణాల చెరువులో నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. 6315 మంది మున్సిపల్ శాఖ సిబ్బంది, 1870 పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని... బోట్ షికారు కోసం 8 రకాల బోట్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలని, అందరూ బాగుండాలని రొట్టె పట్టుకున్నట్లు నారాయణ తెలిపారు.

**ఏర్పాట్లు అద్భుతం: ఎంపీ మాగుంట :** 50 ఏళ్లుగా రొట్టెల పండుగ కార్యక్రమంలో పాల్గొంటున్నానని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈసారి చాలా అద్భుతంగా ఏర్పాట్లు చేశారని కొనియాడారు. 2014 తర్వాత చంద్రబాబు ఆదేశాలతో మంత్రి నారాయణ దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. టూరిజం స్పాట్‌గా బారా షహీద్ దర్గాను తీర్చిదిద్దడం చాలా సంతోషంగా ఉందన్నారు. చెరువుని ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.

# పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ. 200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు. 2026--27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఖీజుం పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఖీజుం పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

## రఘురామకృష్ణంరాజు స్థలం కబ్జా యత్నం..



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు చెందిన రూ. 2 కోట్లకు పైగా విలువైన స్థలాన్ని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు ఒక ముఠా ప్రయత్నించడం సంచలనం సృష్టిస్తోంది. విశాఖపట్నంలోని ప్రముఖ ప్రాంతమైన మధురవాడలో ఉన్న ఈ స్థలానికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో యథేచ్ఛగా నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది.

**1989 నాటి స్థలం.. నకిలీ పత్రాలతో మాయాజాలం! :** డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు 1989లోనే విశాఖ మధురవాడ పరిధిలో 333.33 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం దీని ధర రూ. 2 కోట్లకు పైగా ఉంటుంది. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు కేటుగాళ్లు.. రఘురామకృష్ణంరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను సృష్టించారు. ఆ ఫోర్జరీ డాక్యుమెంట్లతో సదరు స్థలాన్ని పలుమార్లు ఒకరి నుంచి ఒకరికి యాజమాన్య బదిలీ (రిజిస్ట్రేషన్) కూడా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**వెలుగులోకి వచ్చిందిలా.. :** ఈ ఏడాది మే 25, 26 తేదీల్లో కొందరు వ్యక్తులు ఆ స్థలంలోకి చొరబడి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో స్థానికంగా ఉన్న రఘురామకృష్ణంరాజు స్నేహితుడు ఈ విషయాన్ని గమనించి, తక్షణమే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అలర్ట్ అయిన రఘురామకృష్ణంరాజు.. తన వద్ద ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్లను, సదరు వ్యక్తులు చూపిస్తున్న కాగితాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. తన సంతకాన్ని పక్కాగా ఫోర్జరీ చేసి, నకిలీ రిజిస్ట్రేషన్లతో భూమిని కాజేయాలని చూసినట్లు ఆయన గుర్తించారు.

**రంగంలోకి పోలీసులు.. కేసు నమోదు :** తన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారితో పాటు, ఈ ఫోర్జరీ వెనుక ఉన్న దోషులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రఘురామకృష్ణంరాజు ప్రతినిధులు పీఎంపాలెం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పీఎంపాలెం పోలీసులు జూన్ 20న కేసు నమోదు చేశారు. సదరు నకిలీ రిజిస్ట్రేషన్లు ఎక్కడ జరిగాయి? దీని వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులు ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

## ఒకరికి తెలియకుండా మరొకరితో..

**పెద్దవడుగూరు:** ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లాడుతూ పలువురిని మోసం చేసిన యువతిని అనంతపురం జిల్లా పెదవడుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాలు వజ్రపు మణి అలియాస్ శ్వేతారెడ్డి అలియాస్ కీర్తి (27)ని మదనపల్లె మండలం చీలకబైలు వద్ద అరెస్ట్ చేసినట్లు పెద్దవడుగూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పశ్చిమ గోదావరి జిల్లా దొండపూడికి చెందిన నిందితురాలు ఒకరికి తెలియకుండా మరొకరితో.. ఇలా ఐదు పెళ్లిళ్లు చేసుకుంది. విజయవాడకు చెందిన మధ్యవర్తులు సుమప్రియ, అశోక్, శశికళ, రామకృష్ణతో చేతులు కలిపి ఎదురుకట్నం వచ్చేలా పెళ్లి సంబంధాలు కుదుర్చుకునేది. ఒకరితో పెళ్లి తర్వాత వారి వద్ద కొన్ని రోజులు ఉండి స్వస్థలానికి వెళ్లిపోయేది. ఈ క్రమంలో పెద్దవడుగూరు మండలం కాసేపల్లికి చెందిన యాపర్ల సుధీర్‌రెడ్డిని 2025లో వివాహం చేసుకున్న నిత్యపెళ్లికూతురు.. కొద్దిరోజులకే అతడికి చెప్పకుండా మాయమైంది. ఈ ఘటనపై సుధీర్ ఫిర్యాదుతో పెద్దవడుగూరు పీఎస్‌లో కేసు నమోదైంది. ఇటీవల కర్ణాటకలోని మల్లెకుప్పానికి చెందిన ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుని ఆరు రోజుల తర్వాత మదనపల్లె వెళ్తుండగా.. చీకలబైలు వద్ద పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు.

# టీచర్లే 'ఛేంజ్ మేకర్స్'!



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమాజంలో మార్పునకు నాయకత్వం వహించే లీడర్లని అన్నారు. విద్యద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది, అందుకోసమే నేను పట్టుదల, కమిట్ మెంట్ తో విద్యాశాఖను తీసుకున్నాను, ప్రపంచంలో అత్యుత్తమ మోడల్ విద్యావిధానం కోసం అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశించిన స్వర్ణాంధ్ర సాధనలో విద్యాశాఖ కీలకపాత్ర వహిస్తుంది, క్వాంటమ్, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలు అమలు చేయడం విద్యాశాఖ ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. నేను చిన్న వయసులోనే అమెరికా వెళ్లి స్టాన్ ఫోర్డ్ లో విద్యనభ్యసించాను, అక్కడ 100 దేశాల విద్యార్థులతో కలిసి ఐడియాస్, నాలెడ్జి, కల్చర్ పంచుకునే అవకాశం లభించిందని తెలిపారు.

విదేశాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా ఛేంజ్ మేకర్స్ గా తయారు కావాలి. సింగపూర్ అధ్యయన యాత్రలో మీరు నేర్చుకున్న అంశాలను స్కూలు, క్లస్టర్, మండలాల్లో అమలు చేసేందుకు నాయకత్వం వహించండి. సహ టీచర్లకు మెంటరింగ్ చేయండి. టీచర్ – స్టూడెంట్ – సబ్జెక్ట్ రిలేషన్ షిప్ ముఖ్యం. ప్రస్తుతం మనం మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టి, సాఫ్ట్ వేర్ మర్చిపోతున్నాం. రాష్ట్రంలో లీప్ మోడల్ విద్యావ్యవస్థ సాధనకు కలిసికట్టుగా పనిచేయాలి. టీచర్లు బోధనపైనే శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు తేవడం వెనువెంటనే సాధ్యం కాదు, ఇందుకు కొంత సమయం పడుతుంది. రాష్ట్రంలో మనం చేపట్టిన సంస్కరణల కారణంగా ఈ ఏడాది లక్షమందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాతశాలలకు మారారు, ఇది శుభపరిణామం, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మించిన టీచర్లు ప్రైవేటు స్కూళ్లలో లేరు, ఆదర్శవంతమైన విద్యావ్యవస్థ (ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్) సాధనకు మీ సహకారం కావాలి, కలిసికట్టుగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలి, లక్షలాదిమంది బిడ్డల భవిష్యత్తు మనపై ఆధారపడి ఉంది.

ఈరోజు దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ గురించి చర్చ జరుగుతోంది. ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో పోటీపడాలి, ఉపాధ్యాయులకు నా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి లోకేష్ చెప్పారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా ప్రమోషన్లు ఇచ్చాం. మీకు అత్యంత శక్తి, సామర్థ్యాలు ఉన్నాయి, ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ ను ప్రపంచానికి చాటిచెప్పాలి, ఇందులో భాగంగా ఇప్పుడు తొలిఅడుగు వేశాం...అభ్యసన ఫలితాలు, ఎనలిటికల్ థింకింగ్ పై దృష్టిసారించాలి. విద్యావ్యవస్థలో అన్ని సమస్యలను ఒకేరోజు పరిష్కరించడం సాధ్యం కాదు, ప్రాధాన్యత క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం, ప్రజాప్రభుత్వం మీ వెంట ఉంది,

విద్యారంగంలో ఏపీని నెం. 1గా తయారుచేసేందుకు సమిష్టిగా కృషిచేద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. సింగపూర్ టూర్ ద్వారా ఉపాధ్యాయులు వివిధ అంశాలపై కెపాసిటీ బిల్డింగ్ పై శ్రద్ధవహించాలి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75ఏళ్ల వయసులో ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉంటారు. ఇటీవల ఆయన సింగపూర్ వెళ్లి ప్రధాని, ఇతర మంత్రులను కలిసి పలు కొత్తవిషయాలపై అధ్యయనం చేశారు, గత కొంతకాలంగా ప్రభుత్వ టీచర్లకు గౌరవం పెరిగింది, మీరు లీడర్లుగా, ఛేంజ్ మేకర్స్ గా తయారుకండి, మీకు అండగా మేముంటామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, ఎస్ సీఈఆర్ టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి కొండంత అండ 'సీఎంఆర్ఎఫ్'

- **నిడదవోలు పట్టణం లోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో రూ.71.81 లక్షల విలువైన 125 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్**
- **నియోజకవర్గంలో ఇప్పటివరకు 998 మంది లబ్ధిదారులకు రూ.6.79 కోట్ల లబ్ధి చేకూర్చామని వెల్లడి**



నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్ ) :ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద ప్రజల ఆరోగ్య భద్రతకు ఒక గొప్ప వరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నియోజకవర్గానికి చెందిన 125 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 71,81,116 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను, ఎల్‌వోసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 113 మందికి రూ. 45,38,253 విలువైన చెక్కులు, 12 మందికి రూ. 26,42,863 విలువైన ఎల్వోసీ పత్రాలు అందించామన్నారు. "నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, మరియు ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా మొత్తం 998 మంది బాధితులకు రూ. 6,79,62,676 ఆర్థిక లబ్ధి చేకూర్చాం."అని మంత్రి కందుల దుర్గేష్ వివరాలు వెల్లడించారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరుపేదలకు ప్రతి 15 రోజుకొకసారి సీఎంఆర్ఎఫ్ సాయం అందిస్తుండం గొప్ప విషయమని, ఇది ఒక నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.

సకాలంలో నిధులు విడుదల చేసి పేదలను ఆదుకుంటున్నందుకు గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల కు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో నిరుపేదలకు సైతం అత్యాధునిక కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేదలపై ఆర్థిక భారం పడకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా పూర్తి సహకారం అందిస్తున్నామని చెప్పారు. బాధితులు శారీరకంగా, ఆర్థికంగా కుంగిపోకుండా కొండంత అండగా నిలవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.

**ప్రభుత్వానికి లబ్ధిదారుల కృతజ్ఞతలు**

కష్టకాలంలో తమకు అండగా నిలిచినందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలను ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు స్థానిక శాసనసభ్యులు, మంత్రి కందుల దుర్గేష్ లకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలి

- **కేంద్ర హోం మంత్రి అమిత్ షా**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా,విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పెట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు.

ప్రత్యేక రోడ్డు మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యునిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు స్పష్టం చేశారు. అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు.

విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో ఈగల్ పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్రస్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్ధవంతంగా పనిచేస్తోందని చెప్పారు. ఒకప్పుడు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు.

రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, ఈగిల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్‌ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు.

ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ ముగ్గురు ఎక్కడ?



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** సాయికృష్ణ అదృశ్యం కేసు విచారణను సిట్ వేగవంతం చేసింది. సాయికృష్ణ అదృశ్యం ఘటనలో సీఐ నాగరాజుకు అతడి స్నేహితుడు, ఇద్దరు సిబ్బంది సహకరించినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. నాగరాజు అరెస్టుతో హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, నాని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో నేడు హెడ్‌కానిస్టేబుల్ అశోక్ ఇంటికి సిట్ పోలీసులు వెళ్లారు. అతను ఇంట్లో లేకపోవడంతో పోలీసులు వెనుతిరిగారు.

సీఐ నాగరాజుకు హెడ్‌కానిస్టేబుల్ అశోక్ అసిస్టెంట్‌గా ఉన్నారు. ఇటీవలే కృష్ణలంక ఠాణాలో హెడ్‌కానిస్టేబుల్‌గా నానికి పోస్టింగ్ వచ్చింది. మే 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు కానిస్టేబుళు సురేశ్, అశోక్, నాని ముగ్గురూ వడ్డేశ్వరం వెళ్లారని సిట్ గుర్తించింది. ప్రస్తుతం పరారీలో ఉన్న ముగ్గురి కోసం సిట్ అధికారులు గాలిస్తున్నారు. మే 29న వడ్డేశ్వరం వెళ్లిన సీసీ ఫుటేజ్‌ను సిట్ స్వాధీనం చేసుకుంది. సీడీఆర్, సీసీ ఫుటేజ్ ఆధారంగా సాయికృష్ణ అదృశ్యం కేసులో ముగ్గురు కీలకంగా ఉన్నారని సిట్ గుర్తించింది.

మరోవైపు సాయికృష్ణ మృతదేహాన్ని ఏం చేశారు? ఎక్కడ పడేశారు? అన్న వాటిపైనా సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కస్టడీలోనే మరణించినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న ప్రత్యేక దర్యాప్తు బృందం పూర్తి వివరాల కోసం విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందం సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్‌లో అప్పగించినట్లు తేలింది. మే 6 నుంచి 8వ తేదీ వరకు స్టేషన్‌లో ఉన్నా ఆ తర్వాత ఏమయ్యాడో మిస్టరీగా మారింది. స్టేషన్‌లో మొత్తం 60 మంది సిబ్బంది ఉన్నారు. వీరిని అందరినీ సిట్ ప్రశ్నించి, స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తోంది.

మరో రెండు, మూడు రోజులు విచారణ: సాయికృష్ణ వ్యవహారంలో ఏం జరిగిందో సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. సాయికృష్ణ మృతి, శవం మాయం వ్యవహారంలో ఎవరి పాత్ర ఉందో స్టేషన్‌లోని ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తున్నారు. మృతి చెందిన విషయం ఎప్పుడు తెలిసిందో సిబ్బంది స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు.

మరో రెండు, మూడు రోజులు ఈ విచారణ కొనసాగనుంది. కొందరు టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని కూడా పిలిచి వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. వీరిలో కొందరి నుంచి ఆధారాలు దొరికే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులు కొందరు సిబ్బంది పాత్రపై వివరాలు అందజేశారు. వీటిని కూడా పరిశీలిస్తున్నారు. సాయికృష్ణ మరణంపై జ్యుడీషియల్ విచారణ: సాయికృష్ణ కేసులో నిందితుడు నాగరాజు నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని 12 రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అరెస్టు చేశాక విచారణకు సమయం లేకపోయిందని, దీనివల్ల పూర్తి వివరాలు రాలేదని పిటిషన్‌లో పేర్కొంది. కౌంటర్ దాఖలుకు సమయం కావాలని నాగరాజు తరఫు న్యాయవాది సమయం కోరడంతో 29వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

**సీసీటీవీ ఫుటేజీ పిటిషన్‌పై:** మరోవైపు కృష్ణలంక స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీ మాయంపై బాధ్యులు రికార్డులు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని విజయలక్ష్మి మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయవాది సతీష్‌బాబు వాదనలు వినిపించారు. సాయికృష్ణ మృతదేహం ఏమైందో రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొనలేదన్నారు. ప్రతి స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరుపై పర్యవేక్షించాల్సిన బాధ్యత జిల్లాస్థాయి కమిటీకి ఉందని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం సీసీటీవీ ఫుటేజీ కోసం జిల్లా స్థాయి కమిటీకి నోటీసులిచ్చింది. నిందితుడిగా ఉన్న నాగరాజుకూ నోటీసులు ఇచ్చింది. విచారణను ఈనెల 29కి కోర్టు వాయిదా వేసింది.

## సంస్కృత భాషాభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

- **తెలుగు-సంస్కృత అకాడమీ చైర్మన్ విల్సన్‌తో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ భేటీ**



**వడ్డేశ్వరం (జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృత భాషాభివృద్ధి, ప్రచార విస్తరణకు చేపట్టాల్సిన కార్యాచరణపై తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర)తో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి శుక్రవారం వడ్డేశ్వరంలోని అకాడమీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్కృత భాష ప్రాచుర్యం, భవిష్యత్ కార్యాచరణ, సంస్కృత వికాస వారోత్సవాల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఆగస్టు నెలలో నిర్వహించే సంస్కృత వికాస వారోత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహించి సంస్కృత భాష వ్యాప్తికి కృషి చేయాలని సూచించారు. సంస్కృతం జీవ భాష అని, దానిని సమాజంలోని అన్ని వర్గాలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువతలో సంస్కృతంపై ఆసక్తి పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని అభిప్రాయపడ్డారు.

తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ మాట్లాడుతూ, దేశ సమగ్రత, జాతీయ భావాన్ని పెంపొందించడంలో సంస్కృత భాష కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సంస్కృతాన్ని అన్ని సామాజిక వర్గాలకు చేరవేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే "పఠిత సంస్కృతం" పేరుతో పుస్తకాలను ప్రచురించి ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, భవిష్యత్తులో సంస్కృత భాష వ్యాప్తికి ఉపయోగపడే మరిన్ని గ్రంథాలను ప్రచురిస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో సంస్కృత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్, సంస్కృత అధ్యాపకులు నరసింహాచారి మాట్లాడుతూ "అందరికీ సంస్కృతం -- అందరిలోకి సంస్కృతం" అనే లక్ష్యంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు సంస్కృత అకాడమీ సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరారు. సమావేశంలో ప్రొఫెసర్ పీ.టి.జీ. రంగాచార్యులు, శతావధాని శ్యామలానంద ప్రసాద్, డాక్టర్ నరసింహాచారి, సంస్కృత పీఠం అధ్యాపకులు డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో చెడు అలవాట్లకు దూరం కావచ్చు

- ◆ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన క్రికెట్ టోర్నీ!
- ◆ క్రీడల ద్వారా డ్రగ్స్ నిర్మూలనకు వినూత్న ప్రచార కార్యక్రమాలు!
- ◆ కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా చేతుల మీదుగా ప్రారంభం





**వికారాబాద్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం2026 సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రగ్స్ అవేర్‌నెస్ వీక్, కార్యక్రమాల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో డ్రగ్స్ వ్యతిరేక క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పోలీస్, ప్రెస్, డాక్టర్స్, అడ్వకేట్స్, రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయ జట్లు పాల్గొన్నాయి. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ముఖ్య అతిథిగా, ఎస్పీ స్నేహ మెహ్రా గౌరవ అతిథిగా హాజరై క్రీడా జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక టీ-షర్ట్‌ను ఆవిష్కరించి, జట్ల మార్చ్‌పాస్ట్‌కు గౌరవ వందనం స్వీకరించారు. టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ..**

డ్రగ్స్ నిర్మూలన కోసం జిల్లా పోలీస్ శాఖ వినూత్న అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాల వైపు మళ్లాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ..**

డ్రగ్స్ వంటి సామాజిక సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని శాఖల సమన్వయం అవసరమన్నారు. క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలు యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచుతాయని తెలిపారు. ఆరోగ్యకరమైన, సురక్షితమైన, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్, డిటిసి డీఎస్పీ శ్రీనివాస్, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, వికారాబాద్ పట్టణ ఇన్స్పెక్టర్ రఘుకుమార్, ఈషా హాస్పిటల్ ప్రతినిధులు వెంకట్ రెడ్డి, భారత్ రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, , విద్యార్థులుపాల్గొన్నారు.

# వర్షాకాలానికి ఎంఎంసి పూర్తి సన్నద్ధం

- ◆ క్షేత్రస్థాయిలో కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పర్యటన
- ◆ నాలాల డీసిల్టింగ్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- ◆ అక్రమ చెత్త డంపింగ్‌పై కఠిన చర్యలు
- ◆ 24 గంటలు అందుబాటులో మెట్, డీఆర్ఎఫ్ బృందాలు
- ◆ వర్షాల నేపథ్యంలో శాఖల సమన్వయానికి ఆదేశాలు




**హైదరాబాద్ , జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి, కానాజీగూడ, ద్వారకానగర్ కాలనీ, టెంపుల్ ఆల్వాల్ రోడ్, మచ్చ బొల్లారం రోడ్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, వరద నీటి కాలువలు, ఓపెన్ నాలాలు, డ్రైనేజీ అనుసంధానం, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించిన కమిషనర్.. నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు నిరంతరం చేపట్టి వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలనీలు, రహదారుల్లో నీరు నిల్వ కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కానాజీగూడలో ఇంటింటి చెత్త సేకరణ వ్యవస్థను తనిఖీ చేసిన ఆయన, ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది లేదా సాట్ ఆటో డ్రైవర్లు గైర్హాజరైన సందర్భాల్లో వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేసి సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. ద్వారకానగర్ కాలనీలో ఖాళీ స్థలాన్ని అక్రమ చెత్త డంపింగ్ కేంద్రంగా ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన కమిషనర్, వెంటనే చెత్తను తొలగించి బాధ్యులపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. అక్రమ డంపింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. టెంపుల్ ఆల్వాల్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న వినియోగంలో లేని కేబుల్ వైర్లు ప్రజలకు ప్రమాదకరంగా ఉన్నాయని గుర్తించి, సంబంధిత సంస్థలతో సమన్వయం చేసి వాటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. మచ్చ బొల్లారం రోడ్డులో వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటంకంగా ఉన్న ఆక్రమణలను గుర్తించిన కమిషనర్, వాటిని వెంటనే తొలగించి నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మెట్ టీంలు, హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాల సన్నద్ధతను సమీక్షించిన కమిషనర్, వర్షాకాలమంతా 24 గంటలు అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజల భద్రత, పారిశుద్ధ్యం, నీటి పారుదల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం

- ◆ అధికారుల పనితీరును అభినందించిన ప్రత్యేక అధికారి”
- ◆ ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు పనిచేయాలి!
- ◆ వికారాబాద్ జిల్లా అధికారులకు నవీన్ మిట్టల్ సూచనలు!
- ◆ వికారాబాద్ జిల్లా ప్రత్యేక స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్!






**వికారాబాద్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికారాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి నవీన్ మిట్టల్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించడంతో పాటు, ప్రజల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించి వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు 99 రోజులపాటు ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల ఫలితాలు నిజమైన లబ్ధిదారులకు చేరాలంటే అన్ని శాఖలు పకడ్బందీగా పనిచేయాలని సూచించారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, సంక్షేమం తదితర రంగాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సత్వర చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమబద్ధంగా, విజయవంతంగా అమలు చేసినందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులను నవీన్ మిట్టల్ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ లబ్ధిదారుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి సేవలు అందించాలని సూచించారు.

అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చాలని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అధికారులు కేవలం రొటీన్ విధానాలకు పరిమితం కాకుండా ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, జిల్లాలో అమలు చేసేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు. అలాగే పథకాల అమలులో శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని, సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళితే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు. ఆర్థిక అంశాల విషయంలో కూడా అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో వివిధ శాఖలు చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం జిల్లా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల పనితీరును వివరించారు.

సమీక్ష సమావేశానికి ముందు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న నవీన్ మిట్టల్‌కు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఇతర అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఫోటో ప్రదర్శనను ఆయన పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, సీపీఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కుషాయిగూడలో 'అరోమాజ్ బేకరీ అండ్ రెస్టారెంట్' ఘన ప్రారంభం

- ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా ప్రారంభోత్సవం.





**కాప్రా, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన 'అరోమాజ్ బేకరీ అండ్ రెస్టారెంట్' ఘనంగా ప్రారంభమైంది. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం వారు రెస్టారెంట్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, కస్టమర్ల కోసం కల్పించిన అత్యాధునిక సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుషాయిగూడ, కాప్రా ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలు అందించే సంస్థలు మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే ఇలాంటి వ్యాపార సంస్థలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతాయని పేర్కొన్నారు. రెస్టారెంట్ నిర్వాహకులు వెంకట్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌లను అభినందించిన అతిథులు వారి వ్యాపార ప్రస్థానం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆహార ప్రియులను ఆకట్టుకునే విధంగా అరోమాజ్ బేకరీ అండ్ రెస్టారెంట్‌లో ఘుమఘుమలాడే బిర్యానీలు, వివిధ రకాల చికెన్, మటన్ వంటకాలు, తందూరి ఐటమ్స్, చైనీస్, కాంటినెంటల్ మరియు ముగ్లాయ్ వంటకాలు అందుబాటులో ఉంచారు. అలాగే బేకరీ విభాగంలో ఫ్రెష్ కేకులు, పేస్ట్రీలు, పఫ్స్, బ్రెడ్స్‌తో పాటు ప్రత్యేక సందర్భాల కోసం కస్టమైజ్డ్ కేకులను తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన ముడిపదార్థాలతో, పరిశుభ్రమైన వాతావరణంలో తయారైన రుచికరమైన ఆహార పదార్థాలు మరియు బేకరీ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు వెంకట్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్ రెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, ప్రభుదాస్,

గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, పలువురు రాజకీయ, సామాజిక నాయకులు, వ్యాపారవేత్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**మేడ్చల్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం మేడ్చల్ పట్టణంలోని ప్రాథమిక బాలికల పాఠశాల ఆవరణలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ మాట్లాడుతూ, సోనియా గాంధీ స్ఫూర్తితో ఇందిరమ్మ పేరుతో మహిళలకు చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత గౌరవం, ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసినట్లు గుర్తు చేశారు. త్వరలో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలను అప్పగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా ప్రతి ఇంటిలో ఆనందం నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయగా, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుండ శ్రీధర్ కురుమ, కాంగ్రెస్ నాయకులు కుత్తడి నర్సింగ్‌రావు, పెగుడ శ్యాంరావు, చెవిటి అవినాష్, మహమ్మద్ అమీర్, అష్రఫ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

- విద్యార్థినులకు యూనిఫాంలు, నోటుబుక్స్ అందించాలి
- జిల్లా కలెక్టర్‌కు డీవైఎఫ్ఐ వినతిపత్రం



**వికారాబాద్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ లో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల హాస్టల్‌లో ప్రస్తుతం విద్యార్థినుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు, వసతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులందరూ ఒకేచోట కూర్చుని అసెంబ్లీ నిర్వహించుకునే స్థలం కూడా లేదని పేర్కొన్నారు. విద్యార్థినుల శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని, అయితే పాఠశాలలో ఆటస్థలం లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. హాస్టల్ సమీపంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున ఆ స్థలాన్ని పాఠశాలకు కేటాయించి క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే విద్యార్థినులకు తగిన తరగతి గదులు, బెడ్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు యూనిఫాంలు, నోటు పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మాణికేశ్వరనగర్‌లో ఎస్ఐఆర్ పరిశీలన

- ఓటర్లకు అవగాహన కల్పించిన మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి-హరి



**సికింద్రాబాద్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం తార్నాక సర్కిల్ పరిధిలోని మాణికేశ్వరనగర్‌లో ఓటర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తార్నాక మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి-హరి పాల్గొని స్థానిక ప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో కలిసి ఇంటింటికీ వెళ్లిన సరస్వతి-హరి, ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇతర మార్పులు వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆలకుంట సరస్వతి-హరి మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పారదర్శకత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలకిషన్ గౌడ్, కుంచపు జగన్, వేముల నాగరాజు, ఓర్సు శేఖర్, అజ్జు, ఫయాక్, అంజి, రామ్ చరణ్, ప్రభాకర్‌తో పాటు బీఎల్‌వోలు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి పిలుపు!



**వికారాబాద్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని రహీమతుల ఖాన్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28న వికారాబాద్ పట్టణంలోని నర్సింగ్ గౌడ్ కార్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన, సమావేశం జరగనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ సభకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని పార్టీ ఐక్యత, బలాన్ని చాటాలని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, సభ ఏర్పాట్లలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కేటీఆర్ పర్యటన పార్టీకి మరింత ఉత్సాహాన్ని తీసుకురానుందని, అందరూ బాధ్యతగా వ్యవహరించి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కొండరెడ్ల గ్రామ అభివృద్ధిని అడ్డుకుంటున్న అటవీశాఖ

## ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ మరమ్మత్తును అడ్డగించిన అటవీశాఖ



**చింతూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పంచాయతీ లోని చల్లకవ్వం గ్రామం లో 30 కొండ రెడ్డి కుటుంబాలు, ఉప్పన పల్లి గట్టు గ్రామంలో సుమారు 40 కుటుంబాలు నివసిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుండి ఉన్న కరెంట్ విద్యుత్ స్తంభాల స్థానంలో మరమ్మతులు నిర్వహించి కొత్త స్తంభాలు వేయడానికి విద్యుత్ శాఖ పనులు ప్రారంభించింది. అటవీశాఖ అధికారుల అత్యుత్సాహం తో విద్యుత్ లైన్ మరమ్మతుల పనులను అడ్డగించారు. కొండరెడ్ల గ్రామలను అభివృద్ధి చేయాలని , సంకల్పంతో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ లు వాళ్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుంటే అటవీశాఖ శాఖ వాళ్ళ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు. అటవీశాఖ పని తీరు చూస్తుంటే ప్రజల నుంచి ఆగ్రహనికి గురి చేస్తున్నాయి . సుమారు 40 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ లైన్ ప్రమాదకారంగా ఉండడంతో మరమ్మత్తు కు ఆదేశించిన విద్యుత్ శాఖ పనులను అటవీ అధికారులు ఆదివాసి ప్రాంతాల్లో అభివృద్ధికి మోకాలు అడ్డం వేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కరెంట్ లేని ఆదివాసీ గూడెలకు కరెంట్ సౌకర్యం కల్పించాలి అనే ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ ఆదేశాలను బేఖాతరు అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీఓ శుభం నొక్వల్ స్పందించి కొండ రెడ్డి ఆదివాసీ కుటుంబాలలో వెలుగులు నింపాలని కోరుతున్నారు. ఈ సమస్యను ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ ఎడమ అర్జున్ ఆధ్వర్యంలో ఐటిడిఏ ఏపీవో సుజాతకు మెమొరాండం సమర్పించారు. ఈ విషయం గురించి అటవీశాఖ అధికారులు తో మాట్లాడి సమస్యను పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సవలం సత్తిబాబు, ఉప సర్పంచ్ బి బాబురావు, గ్రామస్థులు కదల సుధాకర్ రెడ్డి, కదల రామిరెడ్డి, ఉయిక బాబు, ముత్తయ్య, మహేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు .

# ఉద్యోగుల ఇన్సూరెన్స్ స్కీం ప్రారంభోత్సవం

## -టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊటు యశ్వంత్, శ్రీనివాసరావు



**ఇబ్రహీంపట్నం, (జర్నలిస్ట్ ఫైల్) :** సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటుచేసినతెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎటువంటి ప్రీమియం చెల్లింపు ,విరాళం లేకుండా సహజ మరణం లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవించినప్పుడు1.20 కోట్ల ఎంప్లాయిస్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీము ప్రారంభోత్సవానికి హాజరైన రంగారెడ్డి జిల్లా టిఎన్జీవో నేతలు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బీమా పథకానికి సంబంధించి ప్రభుత్వం అన్ని బ్యాంకాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ స్కీము అమలు చేయడం వలన తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులకు ,పెన్షనర్లకు లబ్ది చేకూరుతుందని వారు తెలిపారు. ఈ స్కీము అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రే స్నా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సుధాకర్, ఎన్జీవో నేతలు సురేష్ ,అన్నపూర్ణ, చేవెళ్ల యూనిట్ టీఎన్జీవో అధ్యక్షులు శివకుమార్ గాయత్రి, వాణి, ఆమనగల్ యూనిట్ టీఎన్జీవో ప్రెసిడెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై మోపిన భారాలను తక్షణమే తగ్గించాలి : సిపిఐ నేత మహమ్మద్ సలాం



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయి అనే నేపంతో ఇష్టం వచ్చినట్లు ఇంధనం కు సంబంధించి మూడు సరుకులు, గ్యాస్ నిత్యావసర సరుకుల ధరలను తీవ్రంగా పెంచారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహ్మద్ సలాం తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రవాణా చార్జీల ధరలు పెంచి చివరికి నిత్యావసర సరుకులు కూడా తీవ్రస్థాయిలో ధరలు పెంచారని ఆరోపించారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని కోరారు. ప్రపంచ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలను తీవ్రంగా తగ్గిపోయిన నేపధ్యంలో తగ్గిన ధరలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ధరలను తగ్గించాలని మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. స్థానిక 52వ డివిజన్లో నరసింహస్వామి గుడి దగ్గర జరిగిన ముఖ్యుల సమావేశంలో సలాం మాట్లాడుతూ యుద్ధం ముగిసిన కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను తగ్గించలేదని విమర్శించారు. ప్రజలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని సలాం మండిపడ్డారు. ఒక పక్కన రూపాయి విలువ పడిపోయిందని ఉపాధి అవకాశాలు లేకుండా విద్య చూస్తే ఫీజులు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు . ప్రభుత్వం దివాలా కోరే విధానాలు దీనికి కారణమని సలాం అన్నారు. కేవలం కుల మతాలను రెచ్చగొడుతూ రాజకీయాలు చస్తున్నాయని ప్రజల అవసరాలను పట్టించుకోవట్లేదని ఒక పథకం ప్రకారంగా ఎస్ఐఆర్ ని తీసుకొచ్చారని దీనికి కేవలం మైనార్టీలను, ఎస్సీ, ఎస్టీలను బలి పశువులను చేద్దామని ఆలోచనతో ఈ ఎస్ ఐ ఆర్ లు తీసుకొచ్చారని కేవలం హిందుత్వం మాత్రమే ఉండాలని బిజెపి మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని సలాం అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాబోయే రోజుల్లో దేశంలో అనేక మార్పులు జరగచ్చని సలాం తెలిపారు . తక్షణమే పెంచిన ధరలను వెంటనే తగ్గించి ప్రజల పై వేసిన భారాన్ని తొలగించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం దే అని సలాం అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సైదా, జాలా నరసింహారావు, ఎస్కే చానా, ఎండి రహిమాన్, ఎండి మజీద్, శేఖర్ నాయక్, కే సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానలు నిర్వీర్యం

## - తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలి





**ఇబ్రహీంపట్నం, (జర్నలిస్ట్ ఫైల్) :** యాచారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ ని సిపిఎం పార్టీ బృందం అకస్మాత్తుగా పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ గారు హాజరై వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో అన్ని గ్రామాలకు ప్రజలకు అందుబాటులో ఉన్న ఆసుపత్రిలో అన్ని వసతులు అసౌకర్యంగా ఉన్నాయని అన్నారు 30 పడకల హాస్పిటల్ గతంలో మంచి సౌకర్యాలు ఉండి అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేవి కానీ క్రమక్రమంగా వైద్య సౌకర్యాలు తగ్గుతూ వస్తున్నాయని అన్నారు 2021 సంవత్సరంలో టిఆర్ఎస్ గవర్నమెంట్లో హాస్పిటల్ డెవలప్మెంట్ కోసం ఒక కోటి 50 లక్ష నిధులు మంజూరు చేసిన నిధులు సక్రమంగా హాస్పిటల్ సౌకర్యాల కోసం నిధులు ఉపయోగించకుండా అధికారులు పక్కదారి పట్టించారని నిధులు సరైన పద్ధతులు ఉపయోగించడంలోఅధికారులు పూర్తి నిర్లక్ష్యం వహించారని అన్నారు తాత్కాలికంగా హాస్పిటల్ డెవలప్మెంట్ కోసం 50 లక్షలు రూపాయలు దుబారా ఖర్చులు చేశారని వెంటనే కలెక్టర్ గారు జోక్యం చేసుకొని 50 లక్షల డబ్బుకు సంబంధించిన విచారణ చేయాలని డిమాండ్ చేశారు నాసిరకమైన కలర్ వేయడం జరిగిందని అదేవిధంగా రోగులకు సంఖ్యకు అనుగుణంగా బెడ్లు లేవని అన్నారు వైద్యులు సరైన సమయానికి రాకుండా వారు ఇష్టం వచ్చినట్టు వచ్చి వెళ్తున్నారని రాత్రిపూట అసలు ఒక్క డాక్టర్ కూడా ఉండని పరిస్థితి ఉందని అన్నారు అదేవిధంగా 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని ఖాళీగా ఉన్న సూపర్డెంట్ ఏఎన్ఎం ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని అన్నారు అదే విధంగా శానిటైజర్ సిబ్బందికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా హాస్పటల్లో కనీసం త్రాగడానికి మంచినీరు సౌకర్యం లేదని అన్నారు అదేవిధంగా మూత్రశాలలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖ మంత్రి ఈ హాస్పిటల్ ని సందర్శించి వెంటనే నిధులు కేటాయించాలని అన్నారు అదేవిధంగా అండర్ డ్రైనేజ్ సమస్య తోపాటు ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని దానికి కావాల్సిన నిధులు వెంటనే మంజూరు చేయాలని అన్నారు లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య రంగంలో ఉన్నటువంటి సమస్యల పైన ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య కార్యవర్గ సభ్యులు బోడ సామిల్ డి రామచందర్ డి జగదీష్ కందుకూరి జగన్ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య మండల కార్యవర్గ సభ్యులు అలంపల్లి జంగయ్య ఎస్ చందు నాయక్ మండల కమిటీ సభ్యులు పి వెంకటయ్య ఉడుతల జంగయ్య మండల బాల్రాజ్ కావాలి జగన్ డి పెద్దయ్య కేతావ నాయక్ విప్లవ కుమార్ పలు గ్రామాల పార్టీ శాఖ కార్యదర్శి లు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి పువ్వాడ



**హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ శివారు జన్వాడాలోని కే. కన్వెన్షన్ వేదికగా జరిగిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ చిన్న కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులు ప్రణయ్–రీతికలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్.

# మాదక ద్రవ్యాల ఉచ్చులో పడొద్దు

## - టౌన్ ఏసీపీ రమణమూర్తి




**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్):** మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. జూన్ 26 న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా జైలు లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో టౌన్ ఏసీపీ పాల్గొని మాట్లాడుతూ ఖైదీలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలు వాటి నుంచి విముక్తి పొందే మార్గాలపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. జైలు జీవితం నుండి బయటపడిన తర్వాత వారు ఆరోగ్యకరమైన, నేరరహిత జీవితాన్ని గడపడానికి కౌన్సెలింగ్ అవసరమన్నారు. ముఖ్యంగా చెడు స్నేహాల వల్ల లేదా పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే అనేక రుగ్మతల భారిన పడతారన్నారు. ఎన్డీపీఎస్ యాక్ట్ పై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం, సరఫరా చేయడం, తయారీ, క్రయవిక్రయాలు అన్నీ క్రిమినల్ నేరాలని.. కఠినశిక్షలు తప్పవని సూచించారు.మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వాళ్లు వాటి నుంచి విముక్తి కోసం స్వయంగా ముందుకు వస్తే వారిపై ఎలాంటి నేర విచారణా ఉండదన్నారు. ఉచితంగా వైద్య సహాయం అంది స్తామన్నారు.కార్యక్రమంలో జైలు సూపరిండెంట్ శ్రీధర్, ఇన్స్పెక్టర్ భానుప్రకాష్, జైలర్ సక్రూ పాల్గొన్నారు.

# యువతకు ఫిట్నెస్ ఎంతో అవసరం

## - హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా ప్రెసిడెంట్ నరాల వెంకటేష్




**ఇబ్రహీంపట్నం, (జర్నలిస్ట్ ఫైల్) :** ఇబ్రహీంపట్నం మండలంలో సిక్స్ ప్యాక్ జిమ్ నీ నూతనంగా ప్రారంభోత్సవానికి జిమ్ ఓనర్స్ బొల్లా మహేందర్, కృష్ణ గార్లు హ్యూమన్ రైట్స్ కమిషన్ రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ నరాల వెంకటేష్ ని ఆహ్వానించడం జరిగింది. వారికి శాలువా కప్పి పూల బొకేతో సన్మానించడం జరిగింది. హ్యూమన్ రైట్స్ కమిషన్ నరాల వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి యువకులకు, పెద్దలకు జిమ్ వర్కౌట్ ప్రతిరోజు రెండు గంటల పాటు అవసరమని జిమ్ చేయడం వల్ల బ్లడ్ సర్కులేషన్ మంచిగా జరిగి ఆరోగ్యంగా ఉంటారు అని తెలియజేశారు. అంతేకాకుండా మన ఆత్మ రక్షణ కోసం ఎంతో అవసరమని ప్రతి పౌరుడు వారి ఫిట్నెస్ పెంచి మాన దేశ రక్షణలో ఉన్నటువంటి ఆర్మీలా తయారు కావాలని కోరారు. దీనికి దీటుగా మహేందర్ ఓనర్ గా మరియు కోచర్గా సొంతంగా సిక్స్ ప్యాక్ జిమ్ నీ నూతనంగా ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత 15 సంవత్సరాల నుండి ఎంతోమంది బాడీ బిల్డర్లు ను తయారు చేసిన ఘనత మహేందర్ కు ఉందన్నారు. గత 15 సంవత్సరాల క్రితం మేమిద్దరం కలిసి జిమ్ వర్కౌట్ చేసినమని తెలియజేశారు. ఈరోజు మహేందర్ జిమ్ వర్కౌట్ సంబంధించిన వసతులతో కలిగి అందరికీ అందుబాటులోకి తీసుకురావడం నాకు చాలా సంతోషంగా ఉందని హ్యూమన్ రైట్స్ కమిషన్ నరాల వెంకటేష్ హర్ష వ్యక్తం తెలియజేశారు.

# సర్ -2026 హౌస్ టు హౌస్ ఎన్యుమరేషన్‌పై పరిశీలన

**ఖమ్మం, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ –2026) కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న హౌస్ టు హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ పరిధిలోని మొత్తం ఓటర్ల సంఖ్య, పూర్తయిన మ్యాపింగ్, పెండింగ్ మ్యాపింగ్ వివరాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ లు), సూపర్వైజర్లు ని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాలు, అవగాహన కరపత్రాలు ప్రతి ఇంటికి సక్రమంగా పంపిణీ అవుతున్నాయా, ఫారం నింపే విధానంపై ఓటర్లకు సరైన అవగాహన కల్పిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు.ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించిన కమిషనర్, ప్రతి బిఎల్ఓ రోజువారీ లక్ష్యాలతో పనిచేస్తూ మూడు రోజుల్లోపు ఫారాల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. హౌస్ టు హౌస్ సర్వే సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు అధికారులకు అందించారు.ప్రతి అర్హత



కలిగిన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. సర్ –2026 కార్యక్రమం విజయవంతంగా అమలయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# క్లినికల్ అప్రెంటిస్షిప్ శిక్షణ కొరకు జులై 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి

**: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు**

**ఖమ్మం, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఇంటర్మీడియట్ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎం.పీ.హెచ్.డబ్ల్యూ – ఫిమేల్) ఒకేషనల్ కోర్సులో మార్చి 2022 నుండి ఉత్తీర్ణులైన విద్యార్థినులకు ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు ఆసుపత్రి పేరునా డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకొని ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల వారు తమ బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జూలై 10 లోగా అందజేయాలని రవిబాబు ఆ ప్రకటనలో తెలిపారు.

# సిరికొండ మండలంలో యాంటీ డ్రగ్ వీక్ సందర్భంగా అవగాహన కార్యక్రమం

**నిజామాబాద్ రూరల్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :**
సిరికొండ సబ్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ వీక్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు సిరికొండ మండలంలోని తూంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు ఆర్థిక నష్టాల గురించి వివరంగా తెలియజేయడం జరిగింది. యువత మరియు విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పోలీసు సిబ్బంది కలిసి గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించారు.తదనంతరం గ్రామ మధ్యలో విద్యార్థులందరూ కలిసి మానవహారం (హ్యూమన్ చైన్) ఏర్పాటు చేసి, “డ్రగ్స్‌కు నో చెప్పండి – జీవితానికి యెస్ చెప్పండి”, “మాదకద్రవ్యాలు మన భవిష్యత్తుకు శత్రువులు” వంటి నినాదాలతో డ్రగ్స్ నిర్మూలనకు తమ మద్దతును తెలియజేశారు.ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను ఎస్ ఐ రామ కృష్ణ కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పోలీసు







సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి

**- విద్యాశాఖ కమిషనర్ కు విన్నవించిన నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ**



**నిజామాబాద్ , (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని కోరుతూ నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ యోగితా రానాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులు పంచ రెడ్డి శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి సుభాష్ లు మాట్లాడుతూ....గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిజాన్ని నమ్ముకొని 95% జర్నలిస్టులు వేతనాలు లేకుండానే విధులు నిర్వహిస్తున్నారని వారి దృష్టికి తీసుకువెళ్లారు.జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నత విద్య కల్పించడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.కావున ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించేలా కృషి చేయాలని కోరుతున్నామన్నారు.జర్నలిస్టుల కోరిక మేరకు విద్యాశాఖ కమిషనర్ యోగిత రానా సానుకూలంగా స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చి సంబంధిత కలెక్టర్కు,జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు,జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# అజంజాహిమిల్లు భూముల వేలం పాటను నిలిపివేయాలి : మిల్లు కార్మిక సంఘాల డిమాండ్

**వరంగల్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :**
వరంగల్ నగరంలోని "ఓ" సిటీ లో ఉన్నటువంటి ఆజాం జాహి మిల్లు భూముల వేలం పాటను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని. అజం జాహీ మిల్లు కార్మికులకు సుప్రీంకోర్టు కేటాయించిన భూములే ఇవ్వాలని –మాడిఫైడ్ వాలంటరీ రిటైర్మెంట్ 2002 వర్కర్స్ యూనియన్ ( ఎంవిఅర్ఎస్) అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం వరంగల్ అజంజాహిమిల్లు గ్రౌండ్ వాటర్ ట్యాంక్ వద్ద మిల్లు కార్మికులు పత్రిక,మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మాడిఫైడ్ వాలంటరీ రిటైర్మెంట్ 2002 వర్కర్స్ యూనియన్ ( అజంజాహిమిల్లు) అధ్యక్షులు కొమ్ముల సందీప్ ప్రధాన కార్యదర్శి బస్కుల.ఈశ్వర్ అధ్యక్షత వహించగా వారుఅజంజాహి మిల్లు కార్మికులతో కలసి వెంకట్రామ జంక్షన్ నందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మీడియా సమావేశంలో కొమ్మల సందీప్ కుమార్ బస్కుల ఈశ్వర్ మాట్లాడుతూ..అజంజాహి మిల్లు భూములను ప్రభుత్వం – కూడా అధికారులు వేలంపాటలు వేయడాన్ని అడ్డుకుంటామని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గత వారం రోజులుగా కార్మికులు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, తమ పోరాటాల ద్వారా నిరసన వ్యక్తం చేసిన ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తూ సుప్రీంకోర్టు తీర్పును 318 మంది కార్మికులకు మిల్లు స్థలంలో భూములు ఇవ్వాలనే



తీర్పును తుంగలో తొక్కి వేలం పాటలు చేస్తుంది. శుక్రవారం 26న జరిగే వేలంపాటలు కార్మికులు, విద్యార్థి సంఘాలు ,అన్ని రాజకీయ పార్టీలు ఈ యొక్క వేలంపాటను రద్దు చేయవసిందిగా ఈ పోరాటానికి ముందుకు వచ్చి వేలంపాటలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఐఎఫ్టియు ఉమ్మడి వరంగల్ అధ్యక్షులు గంగుల.దయాకర్, మరియు జనగం.కుమారస్వామి, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర నాయకులు కంపెల్లి. ప్రవీణ్ ఏపీసీఎల్సీ వరంగల్ జిల్లా నాయకులు దాసు,గద్దల. సంజీవ, కుచన సమ్మయ్య, శ్యామ్,యశోద కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

# అర్బన్ ఎమ్మెల్యేకు ఎన్నిమొరేషన్ పత్రాలు అందజేత




**నిజామాబాద్ , (జర్నలిస్ట్ ఫైల్) :** సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మొదటి రోజు ఎన్యుమరేషన్ పత్రాలను సంబంధిత బిఎల్ఓ సునీత అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణకు,కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో పాల్గొనాలని తెలిపారు.సంబంధిత బిఎల్వోలు ప్రతి ఇంటికి చేరుకొని పత్రాలను అందజేస్తారని,వాటిని పూరించి తిరిగి అధికారులకు అందజేయాలని చెప్పారు.20 ఏళ్ల క్రితం సర్ జరిగిందని,మళ్లీ జరుగుతున్న ప్రక్రియలో ప్రతి ఒక్కరు పాల్గొని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు.ప్రతి ఇంటికి బీఎల్వోలు వచ్చే విధంగా కార్పొరేటర్లు చూడాలన్నారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎన్యుమరేషన్ పత్రాలు అందరికీ అందేలా చూడాలన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ ప్రారంభం

**- ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి**

**నిజామాబాద్ రూరల్, జూన్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ధర్పల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారులు (BLOలు) ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్యునరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేస్తారని తెలిపారు. ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉంటే అంతమందికి ప్రత్యేకంగా ఫారమ్‌లు అందజేయబడతాయని పేర్కొన్నారు.ఓటర్లు ఫారమ్‌లను జాగ్రత్తగా, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిగా నింపి ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతి ఓటరు తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇప్పటికే SIRలో మ్యాపింగ్ చేసిన వారు కూడా తప్పనిసరిగా ఫారమ్‌ను నింపి సమర్పించాలని స్పష్టం చేశారు. BLOలు ఫారమ్‌లు ఇచ్చిన సమయంలో వాటి జిరాక్స్ ప్రతులను తీసుకుని భద్రపరచుకోవడం మంచిదని సూచించారు.ఈ అవగా



హన కార్యక్రమంలో ధర్పల్లి తహసీల్దార్ గారు, గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎజ్జా శ్రీకాంత్, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అమరావతి అద్భుత విజయం



- ఆల్ రౌండ్ పర్ఫామెన్స్ తో అదరగొట్టిన అమరావతి
- కెప్టెన్ ఇన్నింగ్స్ తో అదరగొట్టిన సందీప్
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా సందీప్

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీఎల్ 2026 సీజన్ 5 లో భాగంగా మంగళగిరి వేదికగా మూడవరోజు మొదటి మ్యాచ్లో విజయవాడ సన్ షైనర్స్ మరియు క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్లు తలపడ్డాయి మొదటగా టాస్ గెలిచిన అమరావతి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది

మొదట బ్యాటింగ్ దిగిన విజయవాడ సన్ షైనర్స్ జట్టు ఆదిలోనే ఓపెనర్ అభినవ్ వికెట్ ను కోల్పోయింది దీంతో మన ఓపెనర్ అశ్విన్ హెబ్బార్ మరియు వన్డే బ్యాట్స్మెన్ హర్షవర్ధన్ ఇన్నింగ్స్ ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు అశ్విన్ హెబ్బార్ 25 బంతుల్లో 39 పరుగులు 4 ఫోర్లు 1 సిక్సర్ హర్షవర్ధన్ 27 బంతుల్లో 37 పరుగులు 3ఫోర్లు 1సిక్స్ మరియు డిబి ప్రశాంత్ 31 బంతుల్లో 47పరుగులు 3ఫోర్స్ 2 సిక్సర్స్ తో మంచి ఇన్నింగ్స్ ఆడాడు దీనితో 20 ఓవర్లు ముగిసే సరికి 170 పరుగులకు విజయవాడ సన్ షైనర్స్ జట్టు ఆల్ అవుట్ అయ్యింది అమరావతి బౌలర్ల లో టోషిత్ యాదవ్ మరియు బండారు అయ్యప్ప రెండేసి వికెట్లు పడగొట్టారు

అనంతరం 171 పరుగుల లక్ష్య చేదనకు బరిలోకి దిగిన అమరావతి రాయల్స్ జట్టుకు కెప్టెన్ మరియు ఓపెనర్ యారా సందీప్ టీమును ఒంటి చేత్తో గెలిపించాడు ఏకంగా 61 బంతుల్లో 93 పరుగులు సాధించాడు 6 ఫోర్లు 6 సిక్సర్లతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు మరొక ఎండ్లో ఎస్డిఎన్వి ప్రసాద్ 18 బంతుల్లో 27 పరుగులు 3ఫోర్లు 1 సిక్స్ దీనితో 19 ఓవర్లలోనే 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి అమరావతి జట్టు విజయం సాధించింది విజయవాడ బౌలర్లలో లలిత్ మోహన్ 2 వికెట్లు పడగొట్టాడు . ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా సందీప్ ఎంపికయ్యాడు.

## దోమల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం




- పద్మశాలిపేటలో ఫ్రైడే డ్రైడే, మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పిలుపునిచ్చారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ముగింపు సందర్భంగా పద్మశాలి పేటలో శుక్రవారం ప్రత్యేక ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి దోమల లార్వా పెరిగే నీటి నిల్వలను గుర్తించి తొలగించడంతో పాటు, జీవించి ఉన్న లార్వాలను ప్రజలకు చూపిస్తూ అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా ఇళ్లలోపల, బయట వివిధ పాత్రల్లో నీరు నిల్వ ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అలాంటి నీటి నిల్వలను వెంటనే తొలగించాలని సూచించారు. నీటి నిల్వలపై మూతలు ఉంచడం ద్వారా దోమలు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చని తెలిపారు. దోమతెరలు వినియోగించడం, సాయంత్రం సమయంలో కిటికీలు, తలుపులు మూసివేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల కాట్ల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు.

యూఎల్బీ ఆరోగ్య విస్తరణ అధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూన్ నెలలో నిర్వహించే మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ప్రధాన ఉద్దేశం ప్రజల్లో అవగాహన పెంచి, వ్యాధుల నివారణలో వారిని భాగస్వాములను చేయడమేనన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడితే సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని, స్వీయ వైద్యం చేయరాదని సూచించారు.

కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త కరిముల్లా, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దపప్పూరులో దారుణం... ఆర్టీసీ డ్రైవర్‌పై వేటకొడవళ్లతో దాడి

**అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** అనంతపురం జిల్లా పెద్దపప్పూరులో దారుణం జరిగింది. ఆర్టీసీ డ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. వరదాయపల్లెకు చెందిన వెంకటనారాయణ రోజూ మాదిరి ఆర్టీసీ బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. అయితే పెద్దపప్పూరులో బస్సు ఎక్కిన దుండగులు డ్రైవర్ పై విరుచుకుపడ్డారు. వేడకొడవళ్లతో విచక్షరహితంగా దాడి చేశారు. ఈ దాడిలో డ్రైవర్ వెంకట నారాయణ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయన్ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో డ్రైవర్ నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా సేవకు అంచెలంచెల వ్యవస్థ : ఎమ్మెల్యే నసీర్

- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం
- ప్రతి సమస్యకూ పరిష్కారమే లక్ష్యం
- ప్రజా దర్బార్ లో అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు అంచలంచల వ్యవస్థ పని చేస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా ప్రజల నుంచి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కొందరు నూతన పింఛన్లు రాలేదని, మరి కొందరు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, శానిటేషన్ సరిగా లేదని చెప్పారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే వెంటనే ఫోన్లో సంప్రదించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం రెండేళ్ల పాలనలో ప్రజల సమస్యలకు జవాబుదారీగా ఉంటున్నామని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 365 కోట్ల రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇది నియోజకవర్గంలోనే ఘన చరిత్రని తెలిపారు. శారదా కాలనీ, ప్రగతి నగర్ వంటి మారుమూల ప్రాంతాలతోపాటు గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 88 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామని నియోజకవర్గాన్ని నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ప్రజాదర్బార్లో మొత్తం 67 అర్జీలు ప్రజల నుంచి దాఖలైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## అభాగ్యులు, ఆపన్నులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోంది - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :**గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 47మందికి రూ. 54,50,694/ల చెక్కులు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి అభాగ్యులు, ఆపన్నులకు అద్భుతమైన చేయూతగా నిలుస్తోందని అన్నారు.

వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. సహాయనిధి చెక్కులు అందుకున్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి, స్పష్టంగా స్కాన్ చేసిన అనంతరమే డిజిటైజేషన్ చేసి అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓటరు నమోదు అధికారులు, ఓటరు సహాయ నమోదు అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, డిజిటైజ్ చేసే ఫారాల్లో తాజా ఫోటోను స్పష్టంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఓటరు కాకుండా ఇతరులు సంతకం చేసిన సందర్భాల్లో వారి సంబంధాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని, బొటనవేలి ముద్ర ఉంటే దాని కింద ఓటరు పేరు తప్పనిసరిగా రాయాలని ఆదేశించారు.

ఓటరు, సంతానం కాలమ్‌లలో అవసరమైన వివరాలను మాత్రమే నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటరుకు తెలియకుండా లేదా వారి సమ్మతి లేకుండా ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటైజేషన్ చేయరాదని హెచ్చరించారు. అలాంటి ఘటనలపై ఫిర్యాదులు అందితే తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. డిజిటైజేషన్, సమర్పణకు ముందు ప్రతి ఫారాన్ని పూర్తిగా పరిశీలించి తిరస్కరణలు లేదా తిరిగి సమర్పించాల్సిన పరిస్థితులు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. బూత్ స్థాయి అధికారులతో “బుక్ ఎ కాల్” వ్యవస్థ ద్వారా ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అలాగే గైర్హాజరైనవారు, ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, మరణించినవారు, డూప్లికేట్ నమోదులు, విదేశీయులు మినహా మిగిలిన అర్హులందరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ రూపొందించిన ఈసినెట్ యాప్‌ను ప్రతి ఓటరు డౌన్‌లోడ్ చేసుకుని తమ ఓటరు వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ప్రక్రియలో ఓటరు నమోదు, పేరు తొలగింపు, చేర్పులు, సవరణలు చేసుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు.

# మంత్రి లోకేష్ చొరవతో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం మంగళగిరి 27వ వార్డు పరిధిలోని లబ్ధిదారులకు నాయకులు అందజేశారు.

27వ వార్డు పరిధిలోని మార్కండేయ కాలనీ, రాజీవ్ గృహకల్ప, టిడ్కో గృహ సముదాయాల్లో లబ్ధిదారులను వారి నివాసాల్లో కలిసి చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కొండా శివ నాగేశ్వరమ్మకు రూ. 1,50,758, బిట్ర కుమారికి రూ. 68,164, షేక్ మున్నికి రూ. 42,203, ఉద్దంటి పవిత్రకు రూ. 30,000, ఉద్దంటి రాజ్యలక్ష్మికి రూ. 20,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా ఉంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందేలా మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వాస పద్మావతి, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, వార్డు అధ్యక్షులు పందేటి మణికంఠ, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్,గజ్జల వెంకటరమణ, బుదాటి శ్రీనివాసరావు,సింహాద్రి రామారావు, కొండవీటి రామకోటయ్య, చింతక్రింది వెంకటేశ్వరరావు, పి రామకృష్ణ,షేక్ అన్వర్,ఖాన్, పాగోలు ప్రకాష్, కొల్లి శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో నిరంతర సంబంధాలే బీజేపీ బలోపేతానికి పునాది



- గ్రామస్థాయి నుంచి జనతా వారధి కార్యక్రమాన్ని విస్తరించాలి
- జనతా వారధి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్ ) :** భారతీయ జనతా పార్టీ చేపట్టిన “జనతా వారధి” కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా, ప్రభావవంతంగా అమలు చేసి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించిన జనతా వారధి రాష్ట్ర సమన్వయ కమిటీ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆయన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై సమగ్ర సమాచారాన్ని ప్రతి ఇంటికీ చేరవేయడంలో పార్టీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని అన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా జనతా వారధి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ప్రజాసేవే పరమావధిగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు పార్టీకి మధ్య బలమైన అనుసంధాన వేదికగా జనతా వారధి కార్యక్రమాన్ని తీర్చిదిద్దాలని పి.వి.ఎన్. మాధవ్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సమన్వయ కమిటీ సభ్యులు కార్యాచరణను వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం



- మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో పరామర్శించిన టీడీపీ నేత కొమ్మారెడ్డి కిరణ్ (నాని)

**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మంగళగిరి నియోజకవర్గంలోని చిర్రావూరు గ్రామానికి చెందిన టంకశాల జయసాయి కుటుంబాన్ని టీడీపీ నాయకుడు కొమ్మారెడ్డి కిరణ్ (నాని) శుక్రవారం పరామర్శించారు. పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రమాదంలో యువకుడి మృతి బాధాకరమని పేర్కొంటూ, బాధిత కుటుంబానికి పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా యువత అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## కడప అల్మాస్ పేట ఘటన నిందితుడు మళ్లీ అరెస్ట్.. భారీగా పోలీసుల మోహరింపు



**కడప (జర్నలిస్ట్ ఫైల్ ) :** కడప అల్మాస్ పేట ఘటన నిందితుడు రియాజ్‌ను పోలీసులు మళ్లీ అరెస్ట్ చేశారు. బెయిల్‌పై విడుదలైన ఆయనను టూ టౌన్ పోలీసులు మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. జైలు నుంచి బయటకు రాగానే రియాజ్‌ను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో రియాజ్ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్మాస్ పేట ఘటనకు తమ కుమారుడు రియాజ్‌కు సంబంధం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**గంజాయి కేసులో.. :** గతంలో నమోదైన గంజాయి కేసులో రియాజ్‌ను అరెస్ట్ చూపించారని ఆరోపించారు. ఈ మేరకు సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలతో రియాజ్ హైకోర్టులో హేబియస్ కార్పస్ పిటిషన్ వేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారని తెలిపారు. తన కొడుకుపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని, రెండు నెలలుగా జైల్లో ఉంచారన్న రియాజ్ తల్లి ఆరోపించారు. కనీసం ముఖం కూడా చూపించకుండా మళ్లీ అరెస్ట్ చేశారని రియాజ్ తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు కడప సెంట్రల్ జైలు వద్ద భారీగా మోహరించారు.

# ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌లో భాగంగా గుంటూరు జిల్లాలో విస్తృత తనిఖీలు

- మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీలు
- 724 దుకాణాల తనిఖీ, 100 కేసులు నమోదు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా “ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్” కార్యక్రమాన్ని పోలీసులు విస్తృతంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టడంతో పాటు దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో విద్యార్థులకు హానికరమైన ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో విద్యాసంస్థల సమీపంలోని 1,251 బడ్డీ షాపులను గుర్తించగా, వాటిలో 724 దుకాణాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 100 మందిపై కేసులు నమోదు చేసి రూ. 18,300 జరిమానా విధించారు. తనిఖీల సందర్భంగా గుట్కా, ఖైనీ, పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లు, ఈ-సిగరెట్లు వంటి నిషేధిత లేదా హానికర వస్తువులను విద్యార్థులకు విక్రయించరాదని వ్యాపారులను హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పదంగా డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యాసంస్థలను మాదకద్రవ్యాల రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడం, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడడం, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే “ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్” ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, కోచింగ్ సెంటర్ల పరిసరాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ, ప్రజల సహకారంతో డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగిస్తామని తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## మాచర్ల ప్రమాదంలో మృతుల కుటుంబాలకు అండగా నిలవాలి

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : పల్నాడు జిల్లా మాచర్ల నగరవనం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత విషాదకరమని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మాధవ్, వారికి ప్రభుత్వం అత్యుత్తమ వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కూడా విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రమాదానికి దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన రహదారి భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాధవ్ కోరారు. ప్రజల ప్రాణాల రక్షణకు రోడ్డు భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ )** :ఢిల్లీలో పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన గౌరవ రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ గుంటూరుకు విచ్చేసిన సందర్భంగా నిర్వహించిన స్వాగత యాత్రలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పాల్గొన్నారు.

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-1లోని భాష్యం గరుడ క్యాంపస్ నుండి ప్రారంభమైన స్వాగత యాత్రలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ గారికి మొక్కను బహుకరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ, భాష్యం రామకృష్ణ గారు రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయడం గుంటూరు జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను సమర్థవంతంగా రాజ్యసభ లో ప్రస్తావిస్తూ రాష్ట్రాభివృద్ధికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల సాధనకు ఆయన కీలక పాత్ర పోషిస్తారని నమ్మకాన్ని గళ్ళా మాధవి వ్యక్తం చేశారు.

## అన్యాయం అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడాలన్నదే మొహరం సారాంశం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ )** : సమాజంలో అన్యాయానికి వ్యతిరేకంగా దృఢత్వంతో నిలబడుతూ ధైర్యం,కరుణ ఐక్యత వంటి విలువలను కాపాడడమే మొహరం పర్వదినం యొక్క సారాంశమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. ముస్లింల పవిత్ర మాసం మొహరం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో విడుదల చేసిన ప్రకటనలో సురేష్ బాబు మాట్లాడుతూ మొహరం కేవలం దుఃఖ దినం మాత్రమే కాదని అది మానసిక స్థైర్యం,మానవత్వం గురించి చెప్పే లోతైన పాఠం అని అన్నారు. ఎడారి ప్రాంతంలో జరిగిన కర్బలా యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ ఊహించలేని దాహం అనేక కష్టాలను ఎదుర్కొంటూ అల్లా పై విశ్వాసంతో జరిపిన పోరాటం చరిత్రలో స్ఫూర్తి, ప్రేరణను గా నిలుస్తుందన్నారు. ఇస్లాం సూత్రాలు,సమగ్రత, న్యాయాన్ని కాపాడడానికి ఇమామ్ చేసిన పోరాటం స్ఫూర్తివంతమైనదన్నారు. జీవితంలో సమస్యలను ఎదుర్కొన్నప్పుడు ఎలా నిలబడాలో,సమాజంలో అసమానతలు తొలగించి అన్యాయాన్ని ఎదిరిస్తూ జీవనం గడపటానికి పవిత్ర మాసం మొహరం ప్రేరణ గా నిలుస్తుందన్నారు.

## ఈనెల 28న రెండో దశ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్న ఆర్టీసీ జేఏసీ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ )** : ఏపీఎస్ ఆర్టీసీలో ప్రైవేట్ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడం, సంస్థకు చెందిన విలువైన డిపోలు, ఇతర ఆస్తులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే చర్యల ద్వారా ఆర్టీసీని దశలవారీగా ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. అలాగే పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఈ నేపథ్యంలో ఈనెల 28న విజయవాడలో జేఏసీ రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించి రెండో దశ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. అయినప్పటికీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన హామీ రాకపోవడంతో తదుపరి ఉద్యమ కార్యాచరణపై సమగ్రంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన జేఏసీ నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై ఉద్యోగుల సమస్యలు, సంస్థ భవిష్యత్ పరిస్థితులు, ఉద్యమ వ్యూహంపై సమీక్ష నిర్వహించనున్నారని పేర్కొన్నారు. అలాగే ఉద్యమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఉద్యోగుల ఐక్యతను బలోపేతం చేయడం, ప్రభుత్వ దృష్టికి సమస్యలను మరింత బలంగా తీసుకెళ్లే కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి.హెచ్. సుందరయ్య, కట్టా సుబ్రహ్మణ్యం, ఎస్.వి. శేషగిరి, వై. శ్రీనివాసరావు, డి. మాల్యాద్రి తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణతో పాటు ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం జేఏసీతో కలిసి వచ్చే అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

## ప్రజలకు న్యాయం చేయడమే ప్రజా దర్బార్ లక్ష్యం

○ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

○ తెనాలిలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ )** : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే ఉద్దేశంతో తెనాలిలోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తాగునీరు, రహదారులు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఇతర వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన అర్జీలను ఎమ్మెల్సీకి అందజేశారు. ప్రతి వినతిని ఓపికగా విన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమస్యల స్వభావాన్ని తెలుసుకుని సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు.

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కారానికి కృషి చేయడం ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి కొనసాగిస్తామని ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

○ వెలిగొండ ప్రాజెక్టు పరిశీలన... లబ్ధిదారులతో భేటీ

○ గిద్దలూరులో సంజీవని కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజున యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జూలై నెలకు మొదటి ఫేజ్ పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా సాగుతోన్న వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలనతో పాటు గిద్దలూరు నియోజకవర్గంలో సంజీవని కార్యక్రమంలో పాల్గొంటారు.

**వెలిగొండ లబ్ధిదారులతో సమావేశం** : మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు వెలిగొండ ప్రాజెక్టు ఎంతో కీలకం. ఇది పూర్తైతే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరతాయి. అంతేకాదు దశాబ్దాలుగా నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యకూ ముగింపు పలుకుతుంది. రెండు దశలుగా సాగుతోన్న ఈ ప్రాజెక్టులో.... స్టేజ్--×లో 1,19,000 ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు, స్టేజ్-IIలో 3,28,300 ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. స్టేజ్--× కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ. 5,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దాదాపు 19 కి.మీ. మేర టన్నెల్-I తవ్వకం, ఎగ్జిట్ ఛానల్ ఉ లింక్ ఛానల్ పనులు పూర్తయ్యాయి. ఫీడర్ కాలువ, తీగలేరు, గొట్టిపడియ ప్రధాన కాలువ సిద్ధమయ్యాయి. రెండు హెడ్ రెగ్యులేటర్లు, టన్నెల్ లైనింగ్, అప్రోచ్ ఛానల్, తూర్పు ప్రధాన కాలువ పనులు చివరి దశకు వచ్చాయి. ఆర్ అండ్ ఆర్ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 190 కోట్లను ఖర్చు చేసింది. మొత్తం 11 గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ఈ మేరకు రేపు ప్రాజెక్టును సందర్శించిన అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

**సంజీవనితో మెరుగైన సేవలు** : ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రభుత్వం సంజీవని ప్రాజెక్ట్ తీసుకొచ్చింది. అందరికీ ఆరోగ్య సేవలు, ఆరోగ్య భద్రత చేకూర్చాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యం. నాణ్యమైన, అందుబాటు ధరల్లో, సకాలంలో వైద్య సేవలు అందించే సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక ఈ సంజీవని. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రి వం-కు, ఆరోగ్య ఉప కేంద్రం నుంచి సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేయనున్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, మాతృ-శిశు ఆరోగ్య సేవలు, 108 ఎమర్జెన్సీ, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి వంటి అన్నింటినీ ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ కిందకు తెస్తోంది. గతేడాది జూలై 3న కుప్పంలో, ఈ ఏడాది మార్చి 15న చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా 'సంజీవని' ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో గొప్ప ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి అమలు చేయనుంది. సంజీవని ద్వారా డాక్టర్‌తో అపాయింట్మెంట్ బుక్ చేసుకునే సదుపాయం, వైద్యం తర్వాత డాక్టర్ స్వయంగా ఆరోగ్యంపై ఫాలోఅప్ చేయడం, వర్చువల్ కనెక్ట్ ద్వారా ఎక్సపర్ట్స్ ఉన్న ప్రాంతం నుంచి కూడా వైద్యం అందించడం, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ మోనిటర్ చేయడం, సంజీవని వెల్‌నెస్ యాప్ ద్వారా మీ ఆరోగ్య సూచనలు పొందవచ్చు. డిజిటల్ హెల్త్ రికార్డ్స్‌తో ఒక ఏఐ డాక్టర్‌ను ఇవ్వడమే సంజీవని ముఖ్య ఉద్దేశం

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు** : ఉదయం 10:45 గంటలకు దోర్నాల మండలం, గంటవానిపల్లెకు చేరుకుంటారు. 11 నుంచి మధ్యాహ్నం 12:20 గంటల వరకూ వెలిగొండ ప్రాజెక్టు సందర్శనతో పాటు, అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. వెలిగొండ ప్రాజెక్టు పర్యటన ముగించుకుని 12:35 గిద్దలూరు నియోజకవర్గం కృష్ణంసెట్టిపల్లికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 01.10 నుంచి 01.40 వరకు కృష్ణంసెట్టిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని పథకం లబ్ధిదారులు, వైద్య సిబ్బందితో సమావేశం అవుతారు. 01:45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 03.35 గంటలకు టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 06.15 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి శాశ్వత మినహాయింపు కల్పించాలి

○ ఆర్‌టీఈ చట్టానికి సవరణలు చేయాలని ఎంపీలకు ఫోర్టో వినతి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ )** : సేవలో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నుంచి శాశ్వత మినహాయింపు కల్పించేలా విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ-2009)లో అవసరమైన సవరణలు చేయాలని కోరుతూ ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఫోర్టో నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం జూన్ నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని ఫోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి. శీను, వర్కింగ్ జనరల్ సెక్రటరీ మాగంటి శ్రీనివాసరావు తదితరులు వెల్లడించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం సేవలో ఉన్న ఉపాధ్యాయులు అప్పటి నియామక నిబంధనల ప్రకారమే అవసరమైన అర్హతలు పొంది ప్రభుత్వ సేవలో చేరారని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులను మళ్లీ టెట్ పరీక్ష రాయాలని నిర్బంధించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌ను తప్పనిసరి చేయడం వల్ల మానసిక ఒత్తిడితో పాటు ఉద్యోగ భద్రతపై అనిశ్చితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అందువల్ల ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి శాశ్వత మినహాయింపు కల్పించేలా ఆర్‌టీఈ చట్టంలో అవసరమైన సవరణలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఎంపీలను కోరినట్లు తెలిపారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ వినతిపత్రాల సమర్పణ కార్యక్రమంలో ఫోర్టో నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాండ్లపర్తి శివానందరెడ్డి, ఎస్. పెద్దన్న, కూరపాటి నరసింహారెడ్డి, బోనెల రమేష్, బలివాడ ధనుంజయరావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయురాలిగా కన్నుమూయాలన్నదే నా చివరి కోరిక



○ కలెక్టర్ వద్ద వృద్ధురాలు భావోద్వేగ విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)**: సొంత ఊరిపై, మాతృభూమిపై ఉన్న మక్కువతో 94 ఏళ్ల వయసులో ఓ వృద్ధురాలు అమెరికా పౌరసత్వాన్ని వదులుకుని, తిరిగి భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న అరుదైన ఘటన ఆంధ్రప్రదేశ్‌లో వెలుగుచూసింది. బాపట్ల జిల్లా చినగంజాం మండలం చింతగుంపల గ్రామానికి చెందిన కొండ్రగుంట మహాలక్ష్మమ్మ కథ ఇది.

**అసలేం జరిగిందంటే..**: మహాలక్ష్మమ్మ భర్త నాగభూషణం మరణించిన తర్వాత, అమెరికాలోని వర్జీనియా (పీటర్స్ బర్గ్)లో క్యాన్సర్ నిపుణుడిగా పనిచేస్తున్న తన కుమారుడు డాక్టర్ కొండ్రగుంట బుచ్చయ్య చౌదరి వద్దకు ఆమె వెళ్లారు. అక్కడ నివసిస్తూ జూలై 2000 సంవత్సరంలో అమెరికా పౌరసత్వం పొందారు. దాదాపు 18 ఏళ్ల పాటు అమెరికాలోనే గడిపిన ఆమె, 2018లో తన కుమారుడు మంగళగిరిలోని ఎన్నారై హాస్పిటల్లో చేరడంతో కుటుంబంతో కలిసి తిరిగి మాతృభూమికి వచ్చేసి చింతగుంపల గ్రామంలోనే స్థిరపడ్డారు.

**కలెక్టర్ వద్ద భావోద్వేగ విజ్ఞప్తి..** : తన చివరి రోజులను పుట్టిన గడ్డపైనే గడపాలని నిశ్చయించుకున్న మహాలక్ష్మమ్మ.. ఇప్పటికే తన అమెరికా పౌరసత్వాన్ని వదులుకున్నారు. తిరిగి భారత పౌరసత్వం పొందడం కోసం ఆన్లైన్ పోర్టల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుకు సంబంధించిన అధికారిక విచారణలో భాగంగా తన కుమారుడితో కలిసి బాపట్ల జిల్లా కలెక్టర్‌ను కలిసి భావోద్వేగంగా అభ్యర్థించారు. "కలెక్టర్ గారు.. నాకు ఇప్పుడు 94 ఏళ్లు నిండి 95వ సంవత్సరం వస్తోంది. నా మాతృభూమిలోనే భారతీయ పౌరురాలిగా నా చివరి రోజులు గడపాలని, నేను పుట్టిన ఊరిలోనే నా అంత్యక్రియలు జరగాలని కోరుకుంటున్నాను. దయచేసి నాకు త్వరగా భారత పౌరసత్వం వచ్చేలా సహాయం చేయండి." అని చేతులు జోడించి వేడుకున్నారు. భారత పౌరసత్వం లభిస్తే దేశ రాజ్యాంగానికి, చట్టాలకు కట్టుబడి ఉంటానని ఆమె ప్రమాణ స్వీకారం కూడా చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్.. నిబంధనల ప్రకారం విచారణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, నివేదికను రాష్ట్ర సచివాలయానికి పంపుతామని, అక్కడ నుంచి కేంద్ర ప్రభుత్వ తుది ఆమోదం కోసం సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా అమలు కావాలి



○ బీజేపీ జిల్లా సమీక్ష సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ )** :జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పారదర్శకతతో అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్ నల్లమిల్లి రామకృష్ణరెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, కార్యక్రమం అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సమీక్ష సమావేశంలో ప్రజల నుంచి అందుతున్న అభిప్రాయాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ఎన్యూమరేషన్ ఫారాలపై ఉన్న సందేహాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించి, కార్యక్రమంపై ఉన్న అపోహలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులతో పాటు పార్టీ కార్యకర్తలపై కూడా ఉందన్నారు. బీజేపీ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, పోలింగ్ బూత్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని రామకృష్ణరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాల నింపడంలో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని, అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి బూత్ ఏజెంట్ ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. "ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది. అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదు" అని రామకృష్ణరెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ జోనల్ ఇన్‌చార్జి మేకల హనుమంతరావు, జిల్లా కన్వీనర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, స్వరూపరాణి, వై.వి. సుబ్బారావు, వరికూటి వీరసుధాకర్, బజరంగ్ రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్లు చరక కుమార్ గౌడ్, నారాయణరెడ్డి, వెంకటరమణ, పంచుమర్తి ప్రసాద్, వాసుదేవ నాయుడు, వెంకట కృష్ణారావు, శోభన్‌బాబు, కో-కన్వీనర్లు సాధు రామకృష్ణ, సురేష్ జైన్, యశ్వంత్, అనుమోలు ఏడుకొండల గౌడ్, దుర్గ, సాంబిరెడ్డి, అంబేద్కర్, యోగానంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పీ.వి.చలపతిరావు ఆశయాలు యువతకు స్ఫూర్తి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

○ 92వ జయంతి సందర్భంగా ఘనంగా స్మారక ఉపన్యాస కార్యక్రమం

○ ప్రత్యేక ఆకర్షణగా 'వీర సావర్కర్' చారిత్రక నాటకం




**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్ )** : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, దివంగత పీ.వి. చలపతిరావు 92వ జయంతి సందర్భంగా నిర్వహించిన నాలుగో స్మారక ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం విశాఖపట్నంలోని సాగరమాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పీ.వి. చలపతిరావు తనయుడు పి.వి.ఎన్. మాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డా. బొమ్మరాజు సారంగపాణి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మేధావులు, కళాకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ పీ.వి. చలపతిరావు విద్యా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అందించిన సేవలను స్మరించుకున్నారు. సమాజాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని, ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం మాట్లాడిన పి.వి.ఎన్. మాధవ్, "నా తండ్రి పీ.వి. చలపతిరావే నాకు స్ఫూర్తి" అని పేర్కొన్నారు. 1975లో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించిన సమయంలో ఆయనపై అరెస్టు వారెంట్ జారీ కావడంతో, పార్టీ ఆదేశాల మేరకు 19 నెలలపాటు మారువేషంలో ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

వీర సావర్కర్ జాతీయవాద భావజాలాన్ని, దేశభక్తిని ఆదర్శంగా తీసుకుని పీ.వి. చలపతిరావు ప్రజా జీవితాన్ని కొనసాగించారని మాధవ్ పేర్కొన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ వీర సావర్కర్ స్ఫూర్తితోనే చలపతిరావు ప్రజా జీవితంలో విశేష సేవలందించారని కొనియాడారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి వీర సావర్కర్ త్యాగాలు, జైలు జీవితం, దేశభక్తి, జాతీయోద్యమానికి చేసిన సేవలను వివరించగా, డా. బొమ్మరాజు సారంగపాణి ఎమర్జెన్సీ కాలంలో చలపతిరావుతో కలిసి అజ్ఞాతంలో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు.

కార్యక్రమంలో భాగంగా సంస్కార భారతి సమర్పణలో డా. పి.వి.ఎన్. కృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించిన "వీర సావర్కర్" చారిత్రక నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత్రధారుల నటన, సంభాషణలు, వాచకం, రంగాలంకరణ, నేపథ్య సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నాటకం ముగిసిన అనంతరం ప్రేక్షకులు కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సత్యకుమార్ మాస్టారు, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. కృష్ణ, పరశు రాం రాజు, ద్వారంపూడి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467